

సైకిల్ స్పీడు పెంచాలి



ఏలూరు సభలో చంద్రబాబు, పుట్టా, బడేటి, గన్ని

ప్రజలంతా ఏకపక్షంగా ఓటేయాలి

- సైకో జగన్‌ను ఇంటికి పంపించాలి
- లేదంటే మీ భూములు మిగలవు
- ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేస్తా
- చెత్త బిల్లును చించి పడేయండి
- అన్ని వర్గాలకు న్యాయం చేస్తా
- ఉండి, ఏలూరు సభల్లో చంద్రబాబు

ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి/టూ టౌన్, మే 10 :'ఇంకా మూడు రోజులే ఉంది. ఈ ఎన్నికల్లో చివరి దశకు వచ్చేశాం. మీ బిడ్డల భవిష్యత్తు మార్చడానికి సిద్ధం కండి.. సైకిల్ తీయండి.. మూడు జెండాలు కట్టుకోండి. సైకిల్ స్పీడ్ పెంచండి. ఈ ఎన్నికల్లో కూటమి పక్షాన ఎమ్మెల్యే, ఎంపీలకు 1983 కంటే మెజార్టీ రావాలి. ఏకపక్షంగా సాగాలి. మీ నిర్ణయమే కీలకం. మీరు వేసే ఓటు పార్టీకి కాదు.. మీ బంగారు భవిష్యత్తు కోసం. జనసేనాని పవన్‌కళ్యాణ్ సమాజ హితం కోసమే వచ్చారు.. పడరాని అవమానాలు పడ్డారు..? టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు గెలుపే ధ్యేయంగా పనిచేయాలి. అన్ని సీట్లలోనూ మనమే గెలవాలి. సైకోను సాగనంపాలి' అంటూ తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రమైన ఏలూరుతో పాటు పశ్చిమ గోదావరి జిల్లా ఉండిలో శుక్రవారం జరిగిన ప్రజాగళం బహిరంగ సభల్లో మాట్లాడారు. మండుటెండ ఉన్నా లెక్కచేయకుండా సభకు పెద్దఎత్తున మహిళలు తరలివచ్చారు. దీనిని చంద్రబాబు ప్రస్తావిస్తూ మండుటెండను లెక్క చేయలేదు. ఇప్పుడు మేలో ఉన్నాం. ఆడబిడ్డలు, వీరవనితల్లా రోడ్డు మీదకు వచ్చారు.. మీరు ఏ వైపు ఉంటే ఆ వైపే విజయమని కితాబునివ్వగా హర్షధ్వానాలతో సభికులు స్పందించారు. 'మీ ఓటు కరెంటు చార్జీలు నియంత్రించడానికి కచ్చితంగా ఉపయోగపడుతుంది. ఈ ఐదేళ్లలో మీ కొంప గుల్ల చేశాడు, పెట్రోలు, డీజీలు ధరలు పెంచేశాడు. చెత్త మీద పన్నేశాడు. మద్యం ధరలకు అంతుపొంతూ లేదు. అనేక మంది జేబులు ఖాళీ అయ్యాయి. మీ ప్రాణాలు తీసే జలగ ఈ సైకో అవునా..? జగన్ జే బ్రాండ్స్ తీసిపడేస్తాం. జలగ రక్తం తాగకుండా ఆపితీరుతాం. మీరు వేసే ఓటుతో తాడేపల్లి ప్యాలెస్ కోట బద్ధలు కొట్టాలి. జగన్ సైకో, విధ్వంసకారుడు, అభివృద్ధి నిరోధకుడు, అవినీతిపరుడు. ఇన్నాళ్లు పవన్‌ను ఇబ్బంది పెట్టారా.. లేదా? నన్ను జైల్లో పెట్టాడు. ఏ కారణం లేకుండానే జైలుకీడ్చాడు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం. మీ బిడ్డలను కాపాడతాం' అంటూ చంద్రబాబు భరోసా ఇచ్చారు.



ఉండి సభలో చంద్రబాబును సత్కరిస్తున్న ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే రామరాజు



ఏలూరు సభకు హాజరైన జనం

ఆడబిడ్డలకు అండగా..

కూటమి ఇచ్చే మేనిఫెస్టో కళకళలాడింది. జగన్ మేనిఫెస్టో వెలవెలబోయిందని చంద్రబాబు అంటూనే ఆడబిడ్డలకు తాను అండగా ఉంటానని, ఈ కారణం చేతే మహిళలందరికీ నెలకు రూ.1500 చొప్పున నగదు సాయం, తల్లికి వందనం పేరిట ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున, దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అంతేకాదు పవన్‌కల్యాణ్ నేను కలిసి అందరికీ న్యాయం చేస్తామని ప్రకటించారు.

ఆ చెత్త బిల్లును చింపేయండి..

ఈ మధ్యనే ఓ కొత్త చట్టం వచ్చింది.. జగన్ గ్రాబింగ్ యాక్ట్ అది. లోపభూయిష్టమైంది. ఆయన తన మనుషులను ఎక్కడికక్కడ పెట్టేసి భూములు లాగేసే పెను ప్రమాదం వస్తుంది. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ బిల్లును తక్షణం రద్దు చేస్తాం. ఈ బిల్లు ప్రతులను చించి చెత్త బుట్టలో వేయండి. ఎన్నికల ప్రచారానికి రేపు చివరి రోజు కాబట్టి అంతా ప్రమాణం చేసి ఈ చెత్త బిల్లులను చించేసి పట్టాలు, భూములు అన్నీ మా ఆధీనంలో ఉండాలని ప్రతిజ్ఞ చేయాలన్నారు. తన చేతిలో వున్న ప్రతులను చించి గాలిలో విసిరారు.

మీ ఆశలు, కోర్కెలు తీరుస్తా..

మీ ఆశలు, కోర్కెలు తీర్చే బాధ్యత నాది. ఉద్యోగాలిచ్చి యువతకు భవిష్యత్తునిస్తాం. పింఛను తెచ్చింది టీడీపీనే. రూ.200 నుంచి రూ.2000 ఇచ్చింది టీడీపీనే. ఈ ఐదేళ్లలో జగన్ చేసిందీ ఏమీ లేదంటూ పేదల ఆశలు, కోర్కెలు తీర్చడంలో తాము ముందుంటామని చంద్రబాబు ప్రకటించారు.

ఎన్నికల్లో హోరెత్తించాలి

పోలింగ్ జరిగేందుకు ఇంకా కొద్ది గంటలే. పోలింగ్ జరిగే 13వ తేదీన అందరూ ఆరు గంటలకల్లా నిద్రలేవాలి. ఏడు గంటలకల్లా పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలి. 10 గంటలకల్లా మన ఓట్లన్నీ వేసేయాలంటూ ఓటర్లకు ఆయన పిలుపునిచ్చారు. అవినీతి డబ్బు వద్దే వద్దు. ఉద్యోగులంతా ఏకపక్షంగా ఓట్లేసి చూపించారు. మీరంతా ఎక్కడా వెనక్కుడి తగ్గవద్దు. కూటమిని గెలిపించాలని, మీరు గెలవాలి, మీ పిల్లల జీవితాలు వెలగాలి. అన్న క్యాంటీన్లను తిరిగి తెరుస్తాం. విదేశీ విద్య పథకం పునరుద్ధరిస్తాం. ఎస్సీ, బీసీలకు న్యాయం చేస్తా. ఏలూరులో ఫ్లాష్ సంస్థ నిర్వహించే శ్మశానాన్ని ధ్వంసం చేశారీ దుర్మార్గులు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలున్నారిక్కడ, జిల్లాల వారీగా ఏ, బీ, సీ, డీ వర్గీకరణ దామాషా ప్రకారం అమలు అయ్యేలా చూస్తానని హామీనిచ్చారు.

పేదలకు ఇళ్లు కట్టిస్తా.. ఇంటి స్థలాలు ఇస్తా ..

పేదలకు ఇళ్లు కట్టిస్తాను. ఇళ్ల జాగాలను ఇస్తాను. టిడ్కో ఇళ్లు ఉచితంగా ఇస్తానని ప్రకటించారు. ఏలూరు నగరంలో టైలర్లు అధిక సంఖ్యలో వున్నారని, వారి సంక్షేమానికి కట్టుబడి ఉంటా. నా ఎస్సీలంటాడు, చంపేసి.. డోర్ డెలివరీ చేస్తారు. 03 జీవో తెచ్చి నాశనం చేశాడు. మైనార్టీలకు అంతా చేశానంటాడు. దుల్హాన్ ఇచ్చాడా? విదేశీ విద్య ఇచ్చాడా? షాదీఖానాలు కట్టించాడా ? జగన్ ఏమీ చేశాడంటూనే ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ల కోసం పోరాడతానని, మసీదులు, భవనాలు, రూ.5 లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు తాను సంసిద్ధమేనని చంద్రబాబు ప్రకటించారు. ఈ జలగ చెప్పేదొకటి, చేసేదొకటి. ఈసారి ఎన్నికల్లో అందరూ అప్రమత్తం కావాలి. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఓటేయాలన్నారు.

పోలవరం బాధితులను ఆదుకుంటా..

పోలవరం ప్రాజెక్టు ఈ ప్రాంతానికి ఎంతో అవసరం. అలాంటి ప్రాజెక్టు నిర్మాణానికి భూములిచ్చి ఉన్న ఊళ్లను కోల్పోయి ఎంతో త్యాగం చేశారు. అలాంటి పోలవరం ప్రాజెక్టును ఈ ఐదేళ్లలో జగన్ గోదారిలో ముంచేశాడు. బాధితులను దిక్కుతోచని స్థితిలో వదిలేశాడంటూ చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టు బాధితుల కోసం తక్షణం చేయాల్సిందంతా చేస్తా. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పూర్తిస్థాయిలో అమలు చేస్తా. నేను పోలవరం వెళ్లాల్సి ఉంది. కానీ ఇప్పటికప్పుడు వెళ్లలేకపోతున్నా. బాధితుల పక్షానే నిలబడి కచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

మండుటెండలోనూ ఎదురుచూపులు

చంద్రబాబు రాక కోసం ఉదయం 11 గంటల నుంచి 12పంపుల సెంటర్‌కు నియోజక వర్గ నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. మూడు గంటల పాటు మండుటెండలో ఎదురు చూశారు. నాలుగురోడ్లలో ప్రజలు కిక్కిరిసిపోయారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. సభలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ మంత్రి మారడాని రంగారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, కొట్టు మనోజ్, పూజారి నిరంజన్, చోడే వెంకటరత్నం, బీజేపీ నాయకులు నుదురుపాటి కృష్ణచైతన్య శర్మ, బాడిత నారాయణరావు, అనిల్ ఆచార్య, పాల్గొన్నారు.

సైకో జగన్‌ను సాగనంపుదాం : పుట్టా



రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన సైకో జగన్‌ను సాగనంపి ఎన్‌డీఏ కూటమిలోని టీడీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు రావాల్సిన అవసరం ఉందని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ అన్నారు. ప్రజాగళం ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రంలో రైతులు, యువత, నిరుద్యోగులు, మహిళలతో సహ వ్యాపారులతో సహ అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపడితే రాష్ట్రం బాగుపడుతుంది' అన్నారు. చంద్రబాబుకు నియోజకవర్గ ప్రజలు పడుతున్న బాధలను వివరించారు. ఏలూరు, కొత్తూరు జూట్‌మిల్లులు వైసీపీ ప్రభుత్వ హయాంలో మూసివేశారని, సుమారు ఐదు వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఆ జూట్‌మిల్లును తిరిగి తెరిపించాలని చంద్రబాబును కోరారు. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబు పోరాటానికి మద్దతునిద్దాం : బడేటి



రాష్ట్ర భవిష్యత్తును మార్చడానికి చంద్రబాబు ఐదేళ్లుగా పోరాడుతున్నారని మనమంతా ఆయనకు మద్దతు ఇచ్చి సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవాలని ప్రజలకు ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య(చంటి) విజ్ఞప్తి చేశారు. 1983లో తెలుగుదేశం ప్రభంజనాన్ని మరలా సృష్టించాలన్నారు. ఏలూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 43 వేల మెజారిటీ వచ్చిందని ఆ మెజారిటీని ఈ సారి తిరగరాయాలని కోరారు.

ప్రచారానికి ఫుల్‌స్టాప్



నేటి సాయంత్రంతో అన్ని గప్‌చుప్

- రాజకీయ పార్టీలన్నీ ఎత్తుకు పైఎత్తే..
- ఒకరి పై ఒకరు ఫిర్యాదులకు సంసిద్ధం
- ఓటర్లకు లాలింపులు, బెదిరింపులు
- కూటమి వైపే వైసీపీ నిఘా

రాజకీయం వేడెక్కింది. ఓటర్లు పడునెక్కారు. ప్రచారపర్వం నేటి సాయంత్రంతో ముగియనుంది. ఎక్కడికక్కడ పంపకాలు. కొన్నిచోట్ల చీదరింపులు, మరికొన్నిచోట్ల వెక్కిరింపులు, ఇంకొన్నిచోట్ల బేరసారాలు. సమాంతరంగా అధికారులు, ఉరుకులు, పరుగులు. ఆంక్షల పేరిట పెద్దఎత్తున ప్రచారం. మద్యం షాపులు నేటి సాయంత్రం నుంచి మూసివేత, పోలింగ్ సిబ్బంది సర్వం సిద్ధం. పారా మిలటరీ బలగాల రాక.. సార్వత్రిక ఎన్నికల సమరంలో ప్రచారానికి చివరిరోజు. దాదాపు ఇదేసీను.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఎన్నికల నోటిఫికేషన్ ముందుఒక రీతిలో ఆ తర్వాత ఒకరీతిలో ఎన్నికల కమిషన్ విధించిన నియమావళి అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, మద్దతుదారులు రెచ్చిపోకుండా కట్టడి చేసేలా అనేక విధాలుగా మోకాలాడ్డే చర్యలు తీసుకున్నారు. జిల్లా పరిధిలోని చాలాచోట్ల తనిఖీలు నిర్వహించి, సుమారు రూ.15 కోట్లు విలువైన బంగారపు వస్తువులు, మద్యం, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. జీలుగుమిల్లి అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద భారీగా పోలీసులు మోహరించి ఎప్పటి కప్పుడు తనిఖీలపై సమీక్షించారు. ఎక్కడా తప్పుదొర్లకుండా ఎన్నికల కమిషన్‌ను పరిధిలోకి వెళ్ళి సస్పెన్షన్‌కు గురికాకుండా అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించారు. సాధారణంగా గత ఎన్నికల్లో పోలిస్తే ఈ సారి మద్యం రవాణా, దాదాపు తగ్గుముఖం పట్టింది. నోటిఫికేషన్ జారీ అయిన దగ్గర నుంచి ఇప్పటివరకు కేవలం రూ.మూడుకోట్ల లోపే స్వాధీనం చేసుకోగలిగారు. కాని తెలంగాణ సరుకు భారీ ఎత్తున జిల్లాకు దిగుమతి అయినట్టు అక్కడక్కడ సమాచారం పొక్కినా మందు నిల్వలను పోలీసులు కూడా కనుగొనలేకపోయారు. అభ్యర్థులంతా ఈ మేరకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. సారా రవాణా తగ్గుముఖం పట్టింది.

ఉద్యోగులను ప్రసన్నం చేసుకోవడానికి..

ఎన్నికలు వచ్చాయంటే చాలు ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర, సానుకూలత, వ్యతిరేఖతపై అన్నిపార్టీలు దృష్టిపెడతాయి. గడిచిన మూడేళ్లుగా అధికార వైసీపీపై ఉద్యోగులు మండిపడుతూనే ఉన్నారు. ప్రభుత్వ వైఖరిపట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఉద్యోగులతో పాటు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, పార్ట్‌టైమర్స్, కాంట్రాక్ట్ సిబ్బంది ఇలా ఒకరేంటి అంతా విరుచుకు పడుతూనే వచ్చారు. ప్రత్యేకించి ఎన్నికల విధుల్లో ఉండే వారందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తారు. ఈసారీ అదే జరిగింది. కాని గమ్మత్తు ఏంటంటే ఉద్యోగుల్లో అత్యధికులు ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేఖతతోనే ఉన్నారని, ఏ ఒక్కరూ మెట్టుదిగి రాలేదని విషయం వైసీపీకి బోధపడింది. మూడు వంతుల మందికి ఓటుకు రూ.2వేలు చొప్పున ఎరవేసినా అధికారంలోకి మేం వస్తామని బెదిరించినా ఉద్యోగులు ఎక్కడా తగ్గలేదు. ఇదే విషయాన్ని కూటమి తమకు సానుకూలంగా మలుచుకుంటోంది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక గాలి, ఉద్యోగుల ద్వారా బయటపడిందని, ఇక మిగిలిన ఓటర్లలో అంతకంటే రెట్టింపే ఉందని, ఇప్పటికి ఓ నమ్మకానికి వచ్చింది.

అదిరింపులు, బెదిరింపులు

పోలింగ్‌కు ఇంకా 48 గంటలు మిగిలి ఉండగానే, అప్పుడే అదిరింపులు, బెదిరింపులు ఆరంభమయ్యాయి. ఎన్నికల సంఘం పరిశీలకులు, పోలీస్, నిఘా సిబ్బంది ఒక కన్నేసి ఉన్నా ఇప్పటికే ఓటర్లను తమవైపు ఆకర్షించేందుకు వైసీపీ అడ్డదారులు తొక్కే ప్రయత్నం చేస్తోంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మూడింటిలో ఓటుకి రూ.1500 చొప్పున రూ.2వేలు చొప్పున పంపిణీకి నగదు సమకూర్చుకుంది. డ్వాక్రా సంఘాలకు నగదు పంపిణీకి వీలుగా గ్రూప్‌లీడర్లు, స్థానిక నేతలను వైసీపీ వినియోగించుకుంది. కొన్ని సంఘాలు కూటమి వైపు మొగ్గు చూపుతున్నారనే భావనతో అటువంటి వారందరికి అందరిపైనా ఓ కన్నేసి ఉంచాం. ఎవర్ని వదలమంటూ అధికారపక్షం నుంచి పరోక్ష బెదిరింపులు ఎదురవుతున్నాయి. ఇంతకు ముందు సోషల్ మీడియాలో తమకు పడరాని భావించిన వ్యక్తులపై దూషణల పర్వం కొనసాగించేవారు. ఇప్పుడు అది కాస్త ముదిరి ప్రత్యక్షంగానే వ్యక్తిగత బెదిరింపులకు దిగుతున్నారు. ఏదో పనుందని పిలవడం, వార్నింగ్‌లు ఇవ్వడం చేస్తున్నా పోలీసులకు ఫిర్యాదులు అందకపోవడం విశేషం.

● ఈ రెండురోజులు అత్యంత కీలకం

నేటి సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. అయితే ఆది, సోమవారాల్లో పోలీస్ బలగాలతో పాటు ఎన్నికల అధికారులు నిఘాను రెట్టింపు చేయబోతున్నారు. ఎక్కడా అనుమతి లేకుండా కల్యాణ మండపాల్లో, అతిథిగృహాల్లో వేరే ప్రాంతాలకు చెందిన వ్యక్తులు బస చేయడం, సమావేశం కావడం ఎన్నికల నియమావళికి విరుద్ధం. ఇదే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఎక్కడికక్కడ అతిథిగృహాలు, కల్యాణ మండపాలు, ఊరిచివర తోటల్లోనూ, బంగాళాల్లోనూ వ్యక్తులు కూటమిగా ఉంటే అటువంటి వారిపై చర్య తీసుకోవడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు రాజకీయ పార్టీల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందే అవకాశం ఉంది. ఎందుకనంటే ఇప్పటికే ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి స్థానిక ఓటర్లు అనేకమంది నేడు, రేపు జిల్లాకు చేరబోతున్నారు. వీరి కదలికలపై వైసీపీ ఇప్పటికే ఓ కన్నేసి ఉంచింది. హైదరాబాద్ నుంచి వచ్చే బస్సుల పైనా నిఘా పెట్టారు. వచ్చేవారంతా స్థానిక ఓటర్లు అయినప్పటికి ఏదో ఒక ఇబ్బందికి వారిని గురిచేయాలన్నదే అసలు లక్ష్యంగా కనిపిస్తోంది. మరోవైపు శాంతిభద్రతలను ఉల్లంఘించి పరస్పర దాడులకు పాల్పడేవారిని ఏ మాత్రం ఉపేక్షించబోమని, అటువంటి వారిపై రౌడీషీట్లు తెరవడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. స్వేచ్ఛగా ఎన్నికలు జరిగేలా చూసేందుకు వీలుగానే ముందస్తు కట్టడికి దిగినట్టుగా కనిపిస్తోంది.

కూటమిపక్షంపై నిఘా

జిల్లాలో కూటమి బలంగా మారడంతో వివిధ నియోజకవర్గాల అభ్యర్థులపై వైసీపీ డేగకన్ను వేసింది. ఏ చిన్న అనుమానం వచ్చినా సీవిజిల్‌కి ఫిర్యాదు చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ఆరంభమైన నాటిదగ్గర నుంచి సీవిజిల్‌కు 500కు పైగానే ఫిర్యాదులు అందగా వాటిలో 150కి పైగానే బోగస్ ఫిర్యాదులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ప్రత్యేకించి వ్యక్తులపై కావాలని పనికట్టుకుని ఫిర్యాదులు చేయడం, ఏదోరూపంలో బలహీనపరిచి తద్వారా ఆయా పార్టీల అభ్యర్థులకు నష్టం చేయాలనేదే లక్ష్యంగా కనిపిస్తోంది.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- జిల్లాలో 1,744 పోలింగ్ స్టేషన్లు..
- 16.37 లక్షల మంది ఓటర్లు
- ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతిపౌరుడి బాధ్యత
- కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్..చిత్రంలో ఎస్పీ, డీఆర్వో

ఏలూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధంగా చేశామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలింగ్ ప్రక్రియను ఆయన వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లోని 1,744 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 16.37 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఈనెల 13వ తేదీ ఉదయం ఏడుగంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, అది వారి బాధ్యత. జిల్లాలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. పోటీచేసే అభ్యర్థులు, పార్టీ ఏజంట్లకు తప్ప రాజకీయ పార్టీల వారికి పోలింగ్ బూత్‌నకు వందమీటర్ల పరిధిలోపు అనుమతి లేదు. పోలింగ్ బూత్‌నకు 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. నలుగురికి మించి వ్యక్తులు గుమిగూడితే కేసులు నమోదు చేస్తాం. పోలింగ్‌నకు 48 గంటల ముందునుంచి ఎటువంటి ప్రచారాలు చేయరాదు. రాజకీయ ప్రచారాలకు శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి నిశ్శబ్ద సమయం. ప్రింట్ మీడియా ప్రచారానికి ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. జిల్లాలో ఇప్పటివరకు రూ.15 కోట్ల విలువైన వస్తువులు, నగదును సీజ్ చేశాం. జిల్లాలోని 1,744 పోలింగ్ కేంద్రాలకు గానూ 1,069 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌లు పర్యవేక్షిస్తారు. జిల్లాలో సమస్యాత్మక 416 పోలింగ్ స్టేషన్‌ల్లో లైవ్ టెలికాస్టింగ్ ఏర్పాటు చేశాం. మైక్రో అబ్జర్వర్లను నియమించాం. పారా మిలటరీ బృందాలతో భద్రతా చర్యలు చేపట్టాం. ఈనెల 12వ తేదీ ఉదయం నుంచే పోలింగ్ సిబ్బంది అసెంబ్లీ నియోజకవర్గాల ప్రధాన మండలంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రిని అందిస్తాం. పోలింగ్ సిబ్బందిని తరలించడానికి 150 ఆర్టీసీ బస్సులు, 350 ప్రైవేట్ వాహనాలను ఏర్పాటు చేశాం. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన 100 మంది వలంటీర్లను తొలగించాం. ఐదుగురు ఉద్యోగులు, తొమ్మిదిమంది అవుట్ సోర్సింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకున్నాం. జిల్లాలో ఇంతవరకు 99.4 శాతం ఓటర్ల స్లిప్‌లను పంపిణీ చేశారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు 12 రకాల ఫొటో గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక గుర్తింపు కార్డుతో తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. గత ఎన్నికలలో జిల్లాలో 83 శాతం పోలింగ్ నమోదు కాగా ప్రస్తుత ఎన్నికలలో 90 శాతం లక్ష్యంగా పనిచేస్తున్నా'మని కలెక్టర్ తెలిపారు. ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ.. 'ఎన్నికల నిర్వహణకు నాలుగువేల మంది భద్రతా సిబ్బంది దిని వినియోగిస్తున్నాం. వారిలో వెయ్యిమంది పారా మిలటరీ సిబ్బంది ఉన్నారు. ఎన్నికల్లో విఘాతానికి పాల్పడేవారిపై కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీషీటు తెరుస్తాం. పోలింగ్ సమయంలో రెచ్చగొట్టడం, భయభ్రాంతులకు గురిచేస్తూ హింసాత్మక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటా'మని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్వో పుష్పమణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● జిల్లాలో 15,615 మంది సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 1,614 మంది, దెందులూరు-2,165 మంది, ఏలూరు- 3,123, పోలవరం-2,872, చింతలపూడి- 2,267, నూజివీడు -1,923, కైకలూరు నియోజకవర్గంలో 1,651 మంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారని తెలిపారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి..

ఏలూరు సిటీ, మే 10: జిల్లాలో ఈనెల 13న జరిగే పోలింగ్ స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు, ఓటింగ్ శాతం పెంచేందుకు రాజకీయ పక్షాలు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ రాజకీయ పక్షాల ప్రతినిధులను కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాధారణ ఎన్నికలు -2024 కు సంబంధించి పోలింగ్‌కు ముందు చివరి 72 గంటల ప్రొటోకాల్, ఎన్నికల సన్నద్ధత, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజున జిల్లా ప్రధాన కేంద్రంలో తాము అందుబాటులో ఉంటామని ఏమైనా సమస్య తలెత్తితే 94910 41487కు ఫోన్ చేసి తెలపవచ్చన్నారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

నేడు కైకలూరుకు సీఎం జగన్ రాక

కైకలూరు/ఏలూరు క్రైం, మే 10 : సీఎం జగన్ శనివారం కైకలూరులో జరిగే ఎన్నికల ప్రచార సభలో పాల్గొనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక తాలుకా సెంటర్‌లో బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ మేరకు ఆ పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం కైకలూరులో హెలీప్యాడ్ స్థలాన్ని, సభా ప్రాంగణాన్ని ఎస్పీ మేరీ ప్రశాంతి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే సీఎం పర్యటనకు బందోబస్తుగా నియమించిన పోలీస్ సిబ్బందితో ఏలూరు సీఆర్‌ఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సూచనలు చేశారు.



కైకలూరులో హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

జిల్లాలో 1,89,386.720 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : జేసీ

ఏలూరు సిటీ, మే 10 : జిల్లాలో ఇప్పటివరకు 1,89,386.720 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు జేసీ లావణ్యవేణి శుక్రవారం వెల్లడించారు. కొనుగోలు ప్రక్రియ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు జిల్లాలో 2,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నమోదు చేసుకోగా జిల్లాలో ఇప్పటి వరకు 1,89,386. 720 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రైతులకు చెల్లించాల్సిన రూ.396.63 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.226.22 కోట్లు రైతుల వ్యక్తిగత ఖాతాలకు జమ చేశారన్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో మిగిలిపోయిన 4770. 840 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. వర్షసూచనలు కారణంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ఉండి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేందుకు క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిమిత్తం మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్టు తెలిపారు.


తాడేపల్లిగూడెం

వైసీపీ ఎదురీత

తాడేపల్లిగూడెం నియోజకవర్గం ప్రధాన పార్టీలకు కీలకంగా మారింది. విజయం సాధించాలని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఒకవైపు, తిరిగి తమ స్థానాన్ని నిలబెట్టుకోవాలని వైసీపీ సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. అధికార పార్టీలో అసంతృప్తులు, అవినీతి ఆరోపణలు, ప్రభుత్వ వ్యతిరేకతతో వైసీపీ ఎదురీదుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సమన్వయంతో విజయం దిశగా వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. ప్రచారంలో దూసుకుపోతున్న కూటమి అభ్యర్థి ప్రజలతో కలసిపోయి సానుకూల పరిస్థితులు ఏర్పరచుకుంటున్నారు. మరోవైపు మంత్రి, వైసీపీ అభ్యర్థిని ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. ప్రభుత్వోద్యోగులు సైతం మంత్రిని నిలదీయడం నియోజకవర్గంలో అధికార పార్టీ పరిస్థితితో పాటు ప్రభుత్వంపై వ్యతిరేకతకు అద్దం పడుతుంది.

భీమవరం-ఆంధ్రజ్యోతి

• ప్రచారంలో దూసుకుపోతున్న జనసేన కూటమి అభ్యర్థి • అధికార పార్టీకి అవినీతి మచ్చ



బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన కూటమి

బలం
- జనసేన పార్టీకి తెలుగుదేశం సంపూర్ణ మద్దతు
- తెలుగుదేశం, జనసేన బలమైన ఓటు బ్యాంకు
- కూటమి శ్రేణులన్నీ ఐక్యంగా ప్రచారం చేయడం
- ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు

బలహీనత
- తమదే గెలుపు అంటూ అతి విశ్వాసం
- అభ్యర్థి దూకుడు స్వభావం

కొట్టు సత్యనారాయణ, వైసీపీ

బలం
- నియోజకవర్గంలో వైసీపీ ఓటు బ్యాంకు
- ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు
- తగినంత ఆర్థిక వనరులు ఉండడం కలిసొచ్చే అంశం

బలహీనత
- పార్టీ క్యాడర్‌ను దూరం చేసుకోవడం
- మంత్రి, ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు
- ప్రభుత్వ పథకాల్లో కొంత మందికే లబ్ధిచేకూర్చడం



తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా జనసేన నుంచి బొలిశెట్టి శ్రీనివాస్ బరిలో నిలిచారు. వైసీపీ తరుపున మంత్రి కొట్టు సత్యనారాయణ మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. రెండు వర్గాలలో గెలుపు ధీమా కనిపిస్తోంది. తమదే పైచేయి అని భావిస్తున్నారు. వైసీపీ సంక్షేమ పథకాలపైనే నమ్మకం పెట్టుకుంది. ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకత జనసేన కూటమికి కలసివస్తోంది. జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌కు వ్యతిరేకంగా వైసీపీ కుయుక్తులు పన్నింది. అదే పేరుతో నవయుగ కాంగ్రెస్ తరఫున అభ్యర్థిని రంగంలోకి దింపారు. ఇవేమి తమ విజయాన్ని అడ్డుకోలేవని జనసేన కూటమి విశ్వసిస్తోంది.

వైసీపీలో అసంతృప్తి సెగ

వైసీపీకి అసంతృప్తి సెగ గట్టిగానే తగిలింది. పార్టీ నుంచి ముఖ్య నాయకులు వైదొలిగారు. మంత్రి కొట్టు సత్యనారాయణకు కుడి ఎడమలుగా ఉండే నాయకులు కూడా దూరమయ్యారు. సీనియర్ నేతలు, కీలక నేతలు వైసీపీ నుంచి టీడీపీ, జనసేన పార్టీలో చేరారు. గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి. ముఖ్యమైన నాయకులు దూరం కావడంతో వైసీపీ ఈ ఎన్నికల్లో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అయితే మాజీ ఎమ్మెల్యే ఈలి నాని వైసీపీలో చేరారు. కొట్టు సత్యనారాయణకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. కానీ నాని వర్గంగా ముద్రపడిన నాయకులు టీడీపీలో కొనసాగుతున్నారు. వారు జనసేనకు మద్దతుగా నిలిచారు.

అభివృద్ధి శూన్యం.. అవినీతి ఘనం

తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఐదేళ్లలో అభివృద్ధికి నోచుకోలేదు. ప్రధాన ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. పట్టణానికి ప్రధానమైన సమ్మర్ స్టోరేజీ ట్యాంక్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ముందుకు సాగలేదు. మరోవైపు అవినీతి పెరిగిపోయింది. అధికార పార్టీ నేత దందాకు అంతులేకుండా పోయింది. భవనాల నిర్మాణాలు చేపడితే కమీషన్‌లు, లేఅవుట్‌లు వేస్తే కాసులు ఇలా కోట్లాది రూపాయి దండుకున్నారు. వైసీపీ అభ్యర్థికి వ్యతిరేకత ఉన్న నియోజకవర్గంలో తాడేపల్లిగూడెం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలచింది. ఇదే ఇప్పుడు అధికార పార్టీని ముప్పుతిప్పలు పెడుతోంది. గత ఎన్నికల్లో ఉన్న సందడి ఈసారి వైసీపీ శిబిరంలో కనిపించడం లేదు. అన్ని వర్గాలల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. ఈ అంశం జనసేన, టీడీపీ, బీజేపీ కూటమికి కలసివస్తోంది.



తాడేపల్లిగూడెం నియోజకవర్గం
తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలు

మొత్తం ఓటర్లు 2,14,985
పురుషులు : 1,04, 871, మహిళలు : 1,10,104
ఇతరులు : 10

బరిలో ఉన్న అభ్యర్థులు

1. కొట్టు సత్యనారాయణ	వైసీపీ
2. మార్నిడి శేఖర్	కాంగ్రెస్
3.పీఎస్ఆర్ కృష్ణ	జైభారత్ నేషనల్ పార్టీ
4. బి.ఆంజనేయులు	జాతీయ జనసేన పార్టీ
5. బొలిశెట్టి శ్రీనివాస్	జనసేన పార్టీ
6. బొలిశెట్టి శ్రీనివాసరావు	నవరంగ కాంగ్రెస్
7. మరపట్ల రాజు	రిపబ్లికన్ పార్టీ
8. మేకా వెంకటేశ్వరరావు	పిరమిడ్ పార్టీ
9. ఉంగరాల పద్మ	స్వతంత్ర
10. ఎన్.అచ్యుతకుమార్	స్వతంత్ర
11. బొలిశెట్టి రాజేష్	స్వతంత్ర
12. లంకా ప్రసాద్	స్వతంత్ర

జనసేన కూటమిలో ఐక్యత

జనసేన ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్‌కు టికెట్టు కేటాయించినప్పటి నుంచి తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోంది. జనసేన గెలుపును భుజాన వేసుకుని ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబును సీఎం చెయ్యాలి, తాడేపల్లిగూడెంలో కొట్టు సత్యనారాయణను ఓడించాలని ద్రుఢ సంకల్పంతో టీడీపీ శ్రేణులు పనిచేస్తున్నారు. ఇరవై ఏళ్లుగా టీడీపీకి ప్రాతినిధ్యం లేదన్న బాధను పక్కన పెట్టి పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాలతో నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి జనసేనకు పూర్తి సహకారం అందిస్తున్నారు. పార్టీ శ్రేణులను ముందుండి నడిపిస్తున్నారు. ఇది జనసేనకు పూర్తిగా కలసి వస్తోంది. నియోజకవర్గంలో జనసేన కూటమిదే పై చేయిగా కనిపిస్తోంది.

మునిసిపల్ చైర్మన్‌గా బొలిశెట్టి ప్రస్థానం

కూటమి తరుపున పోటీ చేస్తున్న బొలిశెట్టి శ్రీనివాస్ తెలుగుదేశం హయాంలో మునిసిపల్ చైర్మన్‌గా పనిచేశారు. పట్టణంలో అభివృద్ధి పనులు చేశారు. గత ఎన్నికల్లో జనసేన తరఫున పోటీచేసి ఓటమి చవి చూశారు. ఇప్పుడు కూటమి తరపున జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో టీడీపీకి, జనసేనకు బలమైన ఓటు బ్యాంకు ఉంది. దీనితో కూటమి సునాయాసంగా విజయం సొంతం కానుంది.

గాలి ఉంటేనే కొట్టు గెలుపు

మంత్రి కొట్టు సత్యనారాయణ 1994 నుంచి ప్రతీ ఎన్నికల్లో పోటీ చేస్తూ వస్తున్నారు. రెండు సార్లు గెలుపుసాధించారు. పార్టీ గాలి ఉన్నప్పుడే ఆయన గెలుపు సాధ్యమవుతోంది. రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2004లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019లో జగన్ గాలిలో విజయం సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం జగన్, వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఎదురుగాలి వీస్తోంది. కూటమి పవనాలు బలంగా వీస్తున్నాయి. కొట్టు సత్యనారాయణ ఎన్నికల్లో ఓడిపోతారనే అంచనాలున్నాయి. దీనితో బెట్టింగ్ రాయుళ్లకు నియోజకవర్గంలో పందేలు దొరకడం లేదు. తాయిలాల పంపిణీపై వైసీపీ ఆశలు పెట్టుకున్నట్లు సమాచారం.

ఉంగుటూరు



హోరా హోరీ!

ఉంగుటూరు అసెంబ్లీ స్థానానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారం చేపడుతుందని సెంటిమెంట్. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కూడా పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా జనసేన కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. ప్రధాన పార్టీల మధ్య హోరా హోరీ పోరు సాగుతున్నా.. జనసేన కూటమి అభ్యర్థి విజయం దిశగా దూసుకుపోతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతతో అధికార వైసీపీ అభ్యర్థి వెనకబడ్డారు. జనసేనకు తోడు టీడీపీ, బీజేపీ శ్రేణులు సమన్వయంతో కూటమి అభ్యర్థి విజయానికి ప్రచారం చేపట్టారు. తొలుత కూటమి వెనకబడినట్లు కనిపించినా ప్రజలకు చేరువగా వెళ్లి విజయావకాశాలు అందిపుచ్చుకున్నారు. మరోవైపు అధికార పార్టీ వైసీపీకి అవినీతి మరకలు, ఆక్వా రంగాన్ని నిర్లక్ష్యం చేయడం శాపంగా మారింది. వైసీపీ అభ్యర్థి సౌమ్యుడైనా ద్వితీయ శ్రేణి నాయకుల నిర్వాకం, అభివృద్ధి పనులు లేకపోవడంతో ఆ పార్టీ విజయావకాశాలు సన్నగిల్లాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గెలిపిస్తాయనే ఆశతో ఉన్నారు. కూటమి అభ్యర్థి కొత్త వాడైనా సీనియర్ నేతలు, కూటమి శ్రేణులు ఐక్యంగా కృషి చేస్తున్నాయి. - నిడమర్రు, ఉంగుటూరు

• నియోజకవర్గంలో పట్టుబిగించిన జనసేన కూటమి అభ్యర్థి
• ప్రభుత్వ వ్యతిరేకతతో వెనకబడిన వైసీపీ

ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు హోరాహోరీగా తలపడుతున్నాయి. అధికార వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) రెండోసారి ఎమ్మెల్యే బరిలో నిలిచారు. టీడీపీ, బీజేపీ కూటమి తరఫున జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు తొలిసారి ఎన్నికల్లో అదృష్టం పరీక్షించుకుంటున్నారు. కాంగ్రెస్ తరఫున పాతపాటి హరికుమార్‌రాజు రేసులో ఉన్నప్పటికీ ప్రధానంగా జనసేన కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది.

వైసీపీకి వ్యతిరేక పవనాలు

వాస్తవానికి నియోజకవర్గంలో వైసీపీ ఎదరీదుతోంది. వైసీపీ అభ్యర్థి వాసుబాబు సౌమ్యుడనే పేరున్నప్పటికీ ప్రభుత్వ వ్యతిరేకత తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రధానంగా వైసీపీ హయాంలో ఆక్వా రంగం గడ్డు పరిస్థితులు ఎదుర్కొంది. మేత ధర పెరగడం, చేపలు, రొయ్యల ధరలు తగ్గడంతో రైతులు నిరాశగా ఉన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడింది. భూ యాజమాన్య హక్కుపై రైతులలో ఆందోళన నెలకొంది. ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అభివృద్ధి లేకపోవడం, మౌలిక వసతుల కల్పనలో వైసీపీ ప్రభుత్వ విఫలమైంది. కేవలం సంక్షేమ పథకాల అమలుపైనే ఆధారపడుతున్నారు.

కలసికట్టుగా కదిలిన కూటమి

కూటమి శ్రేణులు కలసికట్టుగా కదలి నియోజకవర్గంలో పట్టు సాధించాయి. టీడీపీ అధిష్ఠానం ఆదేశాలతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు కూటమి విజయంపై పట్టుదలతో పని చేస్తున్నారు. పార్టీ శ్రేణులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశంతో కూటమి విజయానికి మార్గం సుగమం చేస్తున్నారు. బీజేపీ నాయకులు మాలతీరాణీ కూడా ధర్మరాజు విజయానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారు. మూడు పార్టీల కార్యకర్తలు జనసేన విజయాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని సీటు సాధించాలనే కసితో పనిచేస్తున్నాయి.

ధర్మరాజు నేపథ్యం రైతు కుటుంబం

జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు సామాన్య వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. వ్యవసాయ సాగుతో రైతు కష్టనష్టాలు తెలిసిన వ్యక్తి. చేపల ఎగుమతి వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదిగారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువగా ఉన్నారు. గొల్లగూడెంలో లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ద్వారా చిన్న తిరుపతి నడక భక్తులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తూ సేవలందిస్తున్నారు. దీనికి తోడు లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ద్వారా నియోజవర్గంలో తాగునీటి ఇబ్బందులున్న అన్ని ప్రాంతాల్లో సొంత సొమ్ముతో మంచినీటి ట్యాంకర్లు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేశారు.

రాజకీయ కుటుంబం నుంచి వాసుబాబు

వైసీపీ అభ్యర్థి పుప్పాల వాసుబాబు తాతల తండ్రుల నాటి నుంచి రాజకీయాల్లో ఉన్నారు. వాసుబాబు తండ్రి ఏసుబాబు 40 ఏళ్ల క్రితం గణపవరం సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. నియోజకవర్గ ప్రజలకు సుపరిచిత కుటుంబం. గత ఎన్నికల్లో వైసీపీ నుంచి విజయం సాధించిన వాసుబాబు ఐదేళ్లలో వివాదరహితంగా వ్యవహరించారు. గడప గడపకు కార్యక్రమంలో ఇంటింటికీ పర్యటనలో ముందంజలో ఉన్నారు. ఆక్వా ప్రాధాన్యం గల నియోజకవర్గంలో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో రైతుల నుంచి మద్దతు లభించలేదు. ఎమ్మెల్యేగా ప్రజల మన్నన పొందినా ప్రభుత్వ విధానాలు కలసి రాలేదు.

ఉంగుటూరు నియోజకవర్గం
ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు మండలాలు

మొత్తం ఓటర్లు : 2,05,194
పురుషులు : 1,01,020 స్త్రీలు : 1,04,168 ఇతరులు : 6

బరిలో నిలిచిన అభ్యర్థులు

1. పాతపాటి హరి కుమారరాజు	కాంగ్రెస్
2. పుప్పాల శ్రీనివాసరావు	వైసీపీ
3. బుంగా ఏసు	బీఎస్పీ
4. పత్సమట్ల ధర్మరాజు	జనసేన
5. పెద్దపూడి ధర్మరాజు	జాతీయ జనసేన
6. పెరుమాళ్ల మురళీకృష్ణ	పిరమిడ్ పార్టీ
7. పొట్ల ధర్మరాజు	నవరంగ్ కాంగ్రెస్
8. నల్లమిల్లి శంకరరావు	స్వతంత్ర
9. నేకూరి ఆశీర్వాదం	స్వతంత్ర
10. పుట్టా కుమార్	స్వతంత్ర
11. పుప్పాల శ్రీనివాసరావు	స్వతంత్ర
12. బాతు నాగేశ్వరరావు	స్వతంత్ర



పత్సమట్ల ధర్మరాజు, జనసేన కూటమి

బలం
- అందరితో వినయంగా కలివిడిగా ఉండడం
  సేవా కార్యక్రమాలు
- శ్రీ లక్ష్మీనారయణ పౌండేషన్ ద్వారా ట్యాంకర్లుతో తాగునీరు సరఫరా
- మూడు పార్టీల కార్యకర్తలు సమష్టి కృషి

బలహీనత
- పూర్తిస్థాయిలో గ్రామ కార్యకర్తలు లేకపోవడం
- కొన్నిచోట్ల టీడీపీ, జనసేన మధ్య సమన్వయలోపం

పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు), వైసీపీ

బలం
- వివాదరహితుడుగా మంచి పేరు
- సొంత సామాజికవర్గ బలం
- టీటీడీ బోర్డు మెంబరు పదవి ఆర్థికంగా బలమైన సామాజిక వర్గానికి కేటాయింపు

బలహీనత
- జనసేన బరిలోకి దిగడం వైసీపీకి పెద్ద మైనస్
- కార్యకర్తలకు అండగా నిలబడక పోవడం
- రోడ్డు నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టకపోవడం



రూ.500 నోటుదే హవా..



ఎన్నికల ముందురోజు అర్ధరాత్రి వరకూ డబ్బుతోనే అసలైన పని. ఎక్కడ చూసినా డబ్బు పంపిణీపైనే చర్చ. పోలింగ్‌కు గడువు సమీపిస్తున్న కొద్దీ రాజకీయనేతల కంటిపై కునుకు లేకుండా పోతోంది. గత ఎన్నికల్లో హంగామా చేసిన రూ.2 వేల నోటు ప్రస్తుతం కనుమరుగైంది. ఇప్పుడు రూ.500 నోటు పెద్ద దిక్కు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఇప్పటికే గత కొన్నాళ్లుగా రూ.500 నోటు మార్కెట్‌లో కానరావడం లేదు. ప్రస్తుతం రూ. వంద, రెండు వందలు మాత్రమే కనిపిస్తున్నాయి. కరెన్సీలో రూ. 500నోటు పెద్దది కావడంతో లావాదేవీలకు సులభం. ఎన్నికల్లో రూ.500 నోటు హవా నడుస్తోందని అంటున్నారు. డబ్బుతో పాటు మందుబాబుల కోసం మద్యం సీసాలను సమకూర్చుకుంటున్నారు. ఈ నెల 11 రాత్రి 7 నుంచి 13 రాత్రి 7 వరకూ అధికారులు డ్రైడే ప్రకటించారు. - ద్వారకా తిరుమల

పందేలు.. సర్వేలు..



ఎన్నికల్లో పార్టీలు, అభ్యర్థులు, నాయకులు విజయావకాశాలపై సర్వే చేయించుకోవడం, వ్యూహాలు రూపొందించుకోవడం సాధారణం. ఎన్నికల ఫలితాలపై పందేలు కట్టేందుకు కొందరు సొంత సర్వే చేయిస్తున్నారు. ఇప్పటివరకు సర్వేలు చేసిన సంస్థల ప్రతినిధులను కలసి సమాచారం సేకరిస్తున్నారు. రాష్ట్రంలో రెండోసారి వైసీపీ అధికారంలోకి వస్తుందా, లేక ఎన్‌డీఏ కూటమి అధికారం చేపడుతుందా అన్న అంశాలతో పాటు నియోజకవర్గంలో ఏ పార్టీ పైచేయిగా ఉందనే అంశాలపై బెట్టింగ్ వేస్తున్నారు. కైకలూరు నియోజకవర్గ ఫలితాలపై రెండు రోజులుగా భీమవరం, ఏలూరు నుంచి పలువురు బెట్టింగ్ రాయుళ్ళు వచ్చి పందేలకు రంగంలోకి దిగారు. హైదరాబాద్ నుంచి పలువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా ఫోన్లు చేసి పందేలకు సై అంటున్నారు. - ముదినేపల్లి

హలో.. వస్తున్నాం.. ఓటేస్తాం..



హలో.. ఓటేసేందుకు వస్తున్నాం.. మా ఓటు మీకే వేస్తాం.. ఒకటికి పదిసార్లు ఫోన్లు చేసి విసిగించకండిరా బాబోయ్.. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారి గోల ఇది. నెల రోజుల నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు తీరిక ఉన్నప్పుడల్లా వారికి ఫోన్ చేసి ఈ నెల 13న రావాలని, ఓటేయాలని ఫోన్ చేస్తున్నారు. ఎన్నికలకు రెండు రోజులు సమయం మాత్రమే ఉండడంతో దూర ప్రాంతాల ఓటర్లకు నాయకులు మళ్లీ మళ్లీ ఫోన్ చేసి పదే పదే గుర్తు చేస్తున్నారు. గ్రామంలో ఒక నాయకుడిని బాధ్యతలు అప్పగించేశారు. కైకలూరు నియోజవర్గం నుంచి ఒకటే ఫోన్లు, ఒక రోజు ముందే రమ్మంటున్నారు. బాబూ అక్కడికి వచ్చేందుకు ఓటీ చేస్తున్నాం. వస్తాం అంటూ అక్కడి ఓటర్లు సమాధానం చెబుతున్నారు. - ముదినేపల్లి

దారి ఖర్చులు మావే..



రండి.. రండి.. దయ చేయండి తమరి రాక మాకెంతో సంతోషం కదండీ.. అసెంబ్లి ఎన్నికల్లో అభ్యర్థులు, నేతలు ప్రస్తుతం ఈ రాగం ఆలపిస్తున్నారు. సుదూర ప్రాంత ఓటర్లను ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పార్టీల నాయకులు పిలిపిస్తున్నారు. వారి రాకపోకలు దారి ఖర్చులు కూడా మావే అంటూ ఓటర్లకు ఆఫర్ ఇస్తున్నారు. ముఖ్యంగా వైసీపీ సానుభూతి పరులు ఉంటే వారి కోసం ఏకంగా బస్సులు పెడతామని చెబుతున్నారు. కూటమి మద్దతుదారులు ముందుగానే స్వగ్రామాలకు చేరుకున్నారు. హైదరాబాదీలు, ఎన్ఆర్ఐలు ఇప్పటికే గ్రామాల్లోకి వచ్చి ప్రచారం కూడా చేయడం ఫ్యాన్ పార్టీ వాళ్లకు మిగుండుపడడం లేదు. దీంతో వారికి ధీటుగా బయట ప్రాంతాల ఓటర్లను తెచ్చుకునేందుకు గ్రామ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. - తాడేపల్లిగూడెం రూరల్

మందు పోస్తేనే..!



మందుపోయిస్తేనే ప్రచారానికి వస్తామని కొందరు తెగేసి చెబుతుంటే వారికి నచ్చచెప్పడానికి పార్టీల నాయకులు నానా తంటాలు పడుతున్నారు. మద్యం లేకుంటే తమను ప్రచారానికి పిలువవద్దంటూ అల్టిమేటం జారీ చేస్తున్నారు. తగినంత మందు దొరకలేదంటే ఎక్కడినుంచి తీసుకువచ్చి ఇవ్వాలంటూ సర్దిచెబుతున్నా మందుబాబులు వినడం లేదు. వీరి మొండిపట్టుదలతో ఆయాపార్టీలు వార్డు బాధ్యులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. వీరిని ఆదివారం వరకు కాపాడుకునేందుకు కాళ్ళవేళ్ళపడి బతిమిలాడుకుంటున్నారు. మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించటం సమస్యగా మారింది. పరిమితికి మించి అమ్మితే ఫ్లయింగ్ స్క్వాడ్ చేతులు పెడుతోందని, షాపుల వారు జంకుతున్నారు. ఎక్కువమందు ఇవ్వడం, తమ వల్ల కాదంటున్నారు. - ఏలూరు రూరల్

ఎన్నికల పరిశీలకుల గార్డులు గైర్హాజర్

ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ఏలూరు క్రైం, మే 10 : సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో ప్రత్యేక పరిశీలకులుగా వచ్చిన సీనియర్ ఐఏఎస్ అధికారులు బస చేసిన గెస్ట్‌హౌస్ వద్ద విధి నిర్వహణలో ఉన్న ఏఆర్ పోలీస్ గార్డు గైర్హాజరు కావడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సహా ఐదుగురిని సస్పెండ్ చేశారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఇతర రాష్ట్రాల నుంచి ఐఏఎస్, ఐపీఎస్, సీనియర్ అధికారులను పరిశీలకులుగా పంపించారు. నలుగురు అధికారులు కలెక్టరేట్ సమీపంలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో బస చేశారు. ఈనెల 8న రాత్రి నలుగురు అధికారులు గెస్ట్ హౌస్‌లో నిద్రిస్తుండగా ఆగతంకులు గెస్ట్‌హౌస్‌లోకి ప్రవేశించి తలుపులు బాదినట్లు సమాచారం. అధికారులు వెంటనే గార్డు అని పిలిచారని, అక్కడ ఆర్మ్డు రిజర్వు ఐదుగురు పోలీసుల్లో ఒక్కరు కూడా లేకపోవడంతో వారంతా అవాక్కయ్యారు. ఈ విషయం రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పోలీస్‌శాఖ విచారణ చేపట్టింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లా ఆర్మ్డు రిజర్వు హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్లను విధుల నుంచి సస్పెన్షన్ చేస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.



కొవ్వూరు టౌన్ ఔరంగాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు

ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పాలి

కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, మే 10: రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిన జగన్మోహనరెడ్డి ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు టౌన్‌లోని 14,15,16 వార్డులు ఔరంగాబాద్, వాంబే కాలని, బ్రిడ్జిపేటలలో శుక్రవారం ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2019 ఎన్నికలలో ఒక్కఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధిలో వెనకకు నెట్టేశారన్నారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో ప్రజల హక్కులను కాలరాస్తున్నారన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో కొవ్వూరు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై, పార్లమెంటు అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓటువేసి గెలిపించాలన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేస్తుందన్నారు. కౌన్సిలర్ కండెల్లి రామారావు, పాకా జయరామ్, రాచర్ల అచ్యుతరాజు, జొన్నలగడ్డ శ్రీనివాస్, పాకా వెంకన్న, రామారావు, పెనుమాక జయరాజు, వేమగిరి వెంకట్రావు పాల్గొన్నారు.

తాడిపూడిలో కరాటం ప్రచారం



తాడిపూడిలో ప్రచారంలో ఉమ్మడి అభ్యర్థితో కరాటం రాంబాబు

తాళ్లపూడి, మే 10: తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామంలో జనసేన మండలాధ్యక్షుడు గంటా కృష్ణ ఆధ్వర్యంలో గురు వారం రాత్రి కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ప్రముఖ నాయకుడు కరాటం రాంబాబుకు గ్రామ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కరాటం రాంబాబు ప్రచార కార్యక్రమంలో పాల్గొని కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. నామా కొండబాబు, సిద్దన రాధాకృష్ణ, చిన్ని, భీమరాజు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దిపాటి, ముళ్లపూడిపై చర్యలు వద్దు

హైకోర్టు ఉత్తర్వులు

నల్లజర్ల, మే 10: నల్లజర్లలో మంగళవారం అర్ధరాత్రి వైసీపీ, టీడీపీకి మధ్య జరిగిన కొట్లాటలో పోలీసులు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు మరో ఆరుగురు టీడీపీ కార్యకర్తలపై సెక్షన్ 307 (హత్యాయత్నం), ఎస్సీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. దీనిపై మద్దిపాటి, ముళ్ళపూడి హైకోర్టును ఆశ్రయించి రాజకీయ కుట్రలో భాగంగా తమపై అక్రమంగా కేసులు బనాయించారని విన్నవించడంతో ఏడు వారాల పాటు ఇద్దరినీ పోలీసులు విచారించడం, అరెస్ట్ చేయడం కాని చేయరాదని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్టు మద్దిపాటి తెలిపారు. నలజర్లలో శుక్రవారం జిల్లా స్పెషల్ బ్రాంచీ పోలీసులు తనిఖీలు ముమ్మరంగా చేశారు. డీఎస్పీ ఉండగానే కొట్లాట జరిగిందనే వాదనలు వినిపించడంతో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న పోలీస్ సిబ్బందిపై విచారణ చేస్తున్నారు. నల్లజర్లలో పోలింగ్ కేంద్రాల వద్ద మరింత బందోబస్తు నిర్వహించేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. రెండు రోజుల నుంచి నల్లజర్లల్లో స్పెషల్ ఫోర్స్‌తో పాటు పోలీసులు గస్తీ కాస్తున్నారు.

ఆయనా ఇప్పుడే రావాలా ?

15న ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ పాఠశాలల సందర్శన

ఎన్నికల వేళ ఒత్తిడిలో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, ఎంఈవోలు

ఏలూరు ఎడ్యుకేషన్, మే 10 : అసలే ఎన్నికల విధుల్లో హడావుడిగా ఉన్న ఉపాధ్యాయులకు పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ జిల్లా పర్యటన టెన్షన్‌గా మారింది. ఈ సమయంలో ముఖ్య కార్యదర్శి సందర్శన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులకు కంటిపై కునుకులేకుండా చేస్తున్నాయి. ఈనెల 15న పాఠశాలల సందర్శన, విద్యాకానుక పంపిణీ కేంద్రాల్లో పరిశీలన తదితర అంశాలను పేర్కొంటూ ప్రవీణ్‌ప్రకాశ్ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పర్యటనకు వస్తున్నట్టుగా జిల్లా విద్యాశాఖకు కొద్దిరోజుల క్రితం సమాచారం అందింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, ఇపుడు పాఠశాలల సందర్శనకు ముఖ్య కార్యదర్శి రావడమేంటని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్రంలో పోలింగ్ సోమవారం జరుగుతుండగా, ఎన్నికల సామాగ్రిని వివిధ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి చేర్చి రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించేసరికి 14వ తేదీ తెల్లవారుజాము అవుతుందని, వరుసగా రెండురోజుల పాటు అవిశ్రాంతంగా ఎన్నికల విధులను నిర్వర్తించిన నేపథ్యంలో ఆ వెంటనే పాఠశాలలకు చేరుకుని ఏర్పాట్లను చేపట్టడం ఎలా సాధ్యమవుతుందని ఉపాధ్యాయవర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఏడాది పదోతరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిమిత్తం నిర్వహిస్తోన్న వేసవి ప్రత్యేక తరగతుల తీరు, మండలానికి ఒకటిచొప్పున ఏర్పాటుచేసిన విద్యాకానుక పంపిణీ కేంద్రంలో కార్యకలాపాలు, హైస్కూళ్ళలో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పిలు, స్మార్ట్ టీవీలు, విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు, విద్యాకానుక వస్తువుల పంపిణీని ఆయన నేరుగా పరిశీలిస్తారని జిల్లా విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి. టెన్త్ పరీక్షల్లో ఈ ఏడాది జిల్లాలోని 254 ప్రభుత్వ పాఠశాలల నుంచి పరీక్షలు రాసిన బాలబాలికల్లో 4,700 మంది ఫెయిలయ్యారు. వీరితో పాటు ఇంటర్ విద్యతో జిల్లాలోని 22 హైస్కూల్ ప్లస్‌ల నుంచి ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షలురాసిన 365 మంది విద్యార్థుల్లో ఏకంగా 249 మంది ఫెయిల్ కావడంపై ఉన్నతాధికారులు ఒకింత అసంతృప్తితో ఉన్నారు. దీనిపైనా ముఖ్య కార్యదర్శి తనపర్యటనలో దృష్టి సారించే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. అయితే ఎన్నికల విధులకు ప్రయార్టీ ఇవ్వాలా లేక పీఎస్ విజిట్‌కు ప్రాధాన్యమివ్వాలా అనే విషయాల మధ్య నలిగి పోతున్నామని ఈ ఒత్తిళ్ళ మధ్య ఎన్నికల విధులను సరిగా నిర్వహించగలమా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు ఉపాధ్యాయులు.

గోపాల్ యాదవ్ పార్ట్‌టైం పొలిటీషియన్..



సమావేశంలో మాట్లాడుతున్న యాదవ సంఘం నేత బాలు

ఏలూరు టూటౌన్, మే 10: జిల్లా లోని యాదవులను వైసీపీ నాయకుడు గోరుముచ్చు గోపాల్ యాదవ్ దారుణంగా మోసం చేశాడని యాదవ సంఘం, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు కాట్రు బాలు అన్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో బాలు మాట్లాడుతూ గోపాల్‌యాదవ్ పార్ట్ టైమ్ రాజకీయ నాయకుడన్నారు. మూడు నెలలు సింగపూర్‌లో ఉండి ఇక్కడ 10 రోజులు ఉండి రాజకీయం చేస్తాడన్నారు. అలాంటి వ్యక్తికి ఏలూరు ఎంపీ టిక్కెట్టు వచ్చిందని యాదవులందరినీ మోసం చేసి డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు. తీరా ఎంపీ టిక్కెట్టు రాకపోయేసరికి టీడీపీపై అబాండాలు వేస్తున్నాడన్నారు. తన దగ్గర 20 కోట్లు టీడీపీ పార్టీ ఫండ్‌గా తీసుకున్నారని గోపాల్ అనడాన్ని ఖండించారు. ఎవరికి ఎప్పుడు ఎక్కడ ఇచ్చాడో చెప్పాలని సవాల్ విసిరారు. అతనికి ఎంపీగా పోటీ చేసేంత ఆర్థిక పరిస్థితి కానీ సత్తాకానీ లేదని అన్నారు. అందుకే పార్టీ టిక్కెట్టు ఇవ్వలేదన్నారు. పీ.సురేష్, శ్రీనివాస్‌యాదవ్, మల్లిపూడి యాదవ్, కే.జగదీష్‌బాబు, సూర్యచంద్రరావు, నాగు, పాల్గొన్నారు.

చంద్ర జోష్



ఏలూరు : మేమంతా మీ వెంటే..



ఉండిలో..



ఉండి: విజయం మనదే..

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు శుక్రవారం ఏలూరు, ఉండి ప్రజాగళం సభల్లో పాల్గొన్నారు. కూటమి జెండాలతో నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. మండు టెండను సైతం లెక్కచేయకుండా ఉదయం 11 గంటల సమయంలో ఉండిలో జరిగిన సభలో ప్రజలు పాల్గొన్నారు. ఉండి సెంటర్ మూడు పార్టీల జెండాలతో కళకళలాడింది. మధ్యాహ్నం ఏలూరులో జరిగిన సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ఈ సభకు పెద్దఎత్తున మహిళలు, యువకులు తరలివచ్చారు.



ఏలూరు : ఈ జనాన్ని చూస్తుంటే విజయం ఖాయమే..





ఏలూరు : దండాలు సామీ !



ఉండి : కృష్ణంరాజు సతీమణితో చంద్రబాబు



ఏలూరు : ఎంపీ అభ్యర్థి మహేశ్‌తో..



ఏలూరు : యువత ఉత్సాహం



ఉండి : ఎమ్మెల్యే రామరాజు, ఆర్‌ఆర్‌ఆర్‌తో..



ఏలూరులో..





ఉండిలో..

స్మార్ట్ కష్టాలు !



మోటరు లేకపోయినా స్మార్ట్ మీటరు ఏర్పాటు

గుట్టుచప్పుడు కాకుండా బోర్లకు మీటర్లు

బోరు ఒకచోట.. మీటర్ మరోచోట..

ఇబ్బందులు పడుతున్న గిరిజన రైతులు

జీలుగుమిల్లి, మే 10 : వైసీపీ ప్రభుత్వం జిల్లాలో పలు వ్యవసాయ బోర్లకు గుట్టు చప్పుడు కాకుండా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేసే పనిలో పడింది. అస్మదీయులకే ఈ కాంట్రాక్ట్ అప్పగించడంతో ఎన్నికల కోడ్ ఉన్నా గుట్టుచప్పుడు కాకుండా బిగించేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎప్పటి నుంచో వ్యవసాయ బోర్ల వద్ద స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ క్రమంలో ప్రతి చిన్న, సన్నకారు రైతుల నుంచి విద్యుత్ సిబ్బంది బలవంతంగా సర్వీసు నెంబరు, ఆధార్ కార్డు, భూమి వివరాలు తెలిపే 1బీ నకలు తీసుకున్నారు. తగిన సమాచారం ఉన్నతాధికా రులకు అందజేశారు. అప్పట్లో రైతులు, పలు ప్రజా సంఘాలు వ్యవసాయ బోర్లకు మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు. రెండు నెలల నుంచి గిరిజన గ్రామాల్లో రైతుల వ్యవసాయ బోర్లకు వచ్చే విద్యుత్ త్రీఫేజ్ వైర్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే క్రమంలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. బోరు ఒకచోట ఉంటే పక్క పొలంలో ఉన్న స్తంభాలకు స్మార్ట్ మీటర్లు అమర్చారు. తాటియాకులగూడెం శివారు ఉదయ్ భాస్కర్ కాలనీలో గిరిజన మహిళా రైతు ఆసిన నాగమణి పొలంలో వైఎస్సార్ జలకళ పథకంలో రెండో విడతలో బోరు వేసి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేశారు. అయితే నేటికీ ప్రభుత్వం నుంచి రావాల్సిన మోటారు అందలేదు. అయినా అక్కడ విద్యుత్ సర్వీసు ఉండడంతో కాంట్రాక్టర్ స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేశారు. ఈ సమస్యలపై రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారే కరువయ్యారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు ఖర్చు ఎలా ఉన్నా, మీటరు తయారీకి రూ.3 వేలు ఖర్చు అయితే ఆయా సంబంధిత, అనుబంధ పరికరాల పేరుతో ఒక్కో మీటరుకు కాంట్రాక్టర్‌కు రూ.30 వేలు వరకు ప్రభుత్వం చెల్లిస్తున్నట్టు సమాచారం.

గుట్టుచప్పుడు కాకుండా బిగింపు

వ్యవసాయ బోర్ల వద్ద స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో మీటర్ల బిగింపును అడ్డుకుంటారన్న భయంతో రైతులు లేని సమయంలో మోటార్ల వద్ద గుట్టు చప్పుడు కాకుండా మీటర్లు ఏర్పాటు చేసి వెళుతున్నారు. గతంలో ఆ మీటర్‌పై వైఎస్సార్ స్టిక్కర్ ఉండేది. ప్రస్తుతం దాన్ని తొలగించి వైఎస్సార్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం అని ఉండటం గమనార్హం. దీనిపై ఎలక్ట్రికల్ ఏడీ రాజ్‌కుమార్ వివరణ ఇస్తూ 'ప్రస్తుతం వ్యవ సాయ బోర్ల వద్ద ఎటువంటి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం లేదు. ఎన్నికల కోడ్ రావడంతో ఆపారు. మండలంలో మొత్తం 2,500 వ్యవసాయ బోర్ల విద్యుత్తు కనెక్షన్‌లు ఉన్నాయి. ప్రస్తుతం 35 శాతం బోర్ల వద్ద విద్యుత్తు మీటర్లు ఏర్పాటు చేశారు' అని తెలిపారు.

మోటార్ రాలేదు.. మీటర్ బిగించారు



వైఎస్సార్ జలకళ పథకంలో బోరు వేశారు. ఆరు నెలల తర్వాత విద్యుత్ కనెక్షన్‌కు రూ.25 వేలు చెల్లించగా ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వం నుంచి ఆ పథకంలో భాగంగా వచ్చే మోటారు రాలేదు. నిరుపయోగంగా ఉన్నదానికి స్మార్ట్ మీటరు ఏర్పాటు చేశారు.

-నాగమణి, గిరిజన మహిళా రైతు, ఉదయ్ భాస్కర్ కాలనీ

నోట్ల కట్టల్లో తగ్గుతున్న నోట్లు

బెంబేలెత్తుతున్న నాయకులు



కుక్కునూరు, మే 10: ఓట్లకు నోట్ల పంపిణీ జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో పంచాయతీల్లో ఉన్న పార్టీ నాయకులకు సొమ్ము పంపిణీ చేయమని నోట్ల కట్టలు అందిస్తున్నారు. తీరా పంపిణీ సమయంలో నోట్ల కట్టల్లో ఉన్న నోట్లు తగ్గుతున్నాయి. దీంతో పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు బెంబేలెత్తుతున్నారు. కుక్కునూరు మండలంలో ఒక పంచాయతీకి ఇచ్చిన సొమ్ములో దాదాపు రూ.75 వేలు తగ్గాయి. దీంతో అక్కడ పంపిణీ చేస్తున్న నాయకులు అవాక్కయ్యారు. మండలానికి నోట్ల కట్టలు వచ్చే సమయంలోనే పలు నోట్లు తీసి వేస్తుండటంతో ఈ పరిస్థితి తలెత్తుతున్నట్లు చర్చ సాగుతోంది. దీంతో పార్టీ నాయకులే ఆ సొమ్మును సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

బహిరంగంగానే నగదు పంపిణీ

ఉంగుటూరు : ఉంగుటూరు నియోజకవర్గంలో అధికార, ప్రతి పక్ష పార్టీలు గురువారం రాత్రి, శుక్రవారం పట్టపగలు నగదు పంపిణీ చేశారు. అధికార పార్టీ ఓటర్లకు రూ. రెండు వేలు, ప్రతిపక్ష పార్టీ తరఫున రూ.1,500 పంపిణీ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. తెలుగుదేశం, జనసేన తరఫున కుటుంబాలకు చెందిన వారి జాబితా వలంటీర్ల ద్వారా నాయకులు అందజేసినట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా ఎన్నికల నిఘా విభాగం మౌనంగా ఉండడం విశేషం.

రూ.3.40 లక్షలు స్వాధీనం

కామవరపుకోట, మే 10.. కొత్తూరు ఎన్నికల చెక్ పోస్టు వద్ద శుక్రవారం అధికారులు వాహన తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి ఎటువంటి ఆధార పత్రాలు లేకుండా తీసుకు వెళుతున్న రెండు లక్షల 60 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్టు అధికారి ఎండీ మొహిద్దీన్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల ద్వారా ఏలూరు ఎన్నికల ట్రెజరీకు పంపామన్నారు.



ఉంగుటూరు : ఉంగుటూరులో ఫ్లైయింగ్ స్క్వాడ్ శుక్రవారం తనిఖీల్లో భాగంగా ఒకరి నుంచి రూ 80 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు రిటర్నింగ్ అధికారి ఖాజా వలీ తెలిపారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.4

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. ఆచంట				
2. పాలకొల్లు				
3. నరసాపురం				
4. భీమవరం				
5. ఉండి				
6. తణుకు				
7. తాడేపల్లిగూడెం				
8. ఉంగుటూరు				
9. దెందులూరు				
10. ఏలూరు				
11. పోలవరం				
12. చింతలపూడి				
13. గోపాలపురం				
14. కొవ్వూరు				
15. నిడదవోలు				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : రాచర్ల రోడ్, అలంపురం, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా - 534 166.

అభివృద్ధి, సంక్షేమమే నా ధ్యేయం

- చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తా
- మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం
- ఆంధ్రజ్యోతితో చింతలపూడి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్



(చింతలపూడి):

'రాజకీయాల్లోకి రాకముందు ఎన్ఆర్ఐగా మిషన్ హోప్ సంస్థ ఏర్పాటు చేసి అక్కడ వచ్చిన సంపాదన నుంచి కొంత పేదల సేవా కార్యక్రమాలకు వినియోగించేవాడిని. నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చా, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేస్తే రైతుల సమస్యకు పరిష్కారం లభిస్తుంది. రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తా. పరిశ్రమల ఏర్పాటుకు నా వంతు ప్రోత్సాహం అందించి ఉపాధి అవకాశాలు చూపిస్తా. ఈ ప్రాంతం విద్య, వైద్య, రవాణా రంగాల్లో ఇంకా వెనుకబడే ఉంది. వీటిపై దృష్టిపెడతా. అనుకున్నది సాధించటమే నా లక్ష్యం. చంద్రబాబు ఆశీస్సులు, కలిసి వస్తున్న జనసైన్యం, దళిత జనులు, అన్ని సామాజిక వర్గాలతోడుగా నా గెలుపు సునాయాసమే' అని చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

• ఎన్నికల ప్రచారం ఎలా ఉంది?

ఏ గ్రామం వెళ్ళినా ముఖ్యంగా మహిళలు స్వాగతిస్తున్నారు. చదువుకున్న యువకుడిగా పని చేస్తానన్న నమ్మకం వారిలో బలంగా ఉంది. ప్రజల్లో ఆదరణ కనిపిస్తోంది. ఎంపీ శ్రీధర్ సొంత గ్రామంలోనే 1,500 మంది స్వచ్ఛందంగా కూటమిలో చేరారు. జనం మార్పు కోరుతున్నారు.

• నియోజకవర్గ సమస్యల పై అవగాహన ఉందా?

నేను ఈ ప్రాంతంలో పదేళ్ళుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నా, సమస్యలు అన్నింటి పైనా అవగాహన ఉంది. వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తా.

• సమస్యలకు ఏ విధంగా పరిష్కారం చూపుతారు ?

ఇది పెద్ద నియోజకవర్గం. ప్రధానమైనవి రోడ్లు, డ్రైనేజీల వంటి మౌలిక సదుపాయాలు కావాలి. గత ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. వీటికి ప్రాధాన్యత ఇస్తా. చింతలపూడి, జంగారెడ్డిగూడెం పట్టణాల అభివృద్ధిపై దృష్టి పెడతా.

• రైతుల సాగునీటి సమస్య ఎలా పరిష్కరిస్తారు?

వైసీపీ ఐదేళ్ళ పాలనలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదు. ఈ పథకాన్ని గతంలో మాజీ మంత్రి దేవినేని ఉమ, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ కొంత భాగం పూర్తి చేశారు. మిగిలింది ఎంపీ అభ్యర్థి పుట్టామహేష్ సహకారంతో పూర్తి చేయిస్తా. దీనివల్ల సాగు, తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

• అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక ఉందా?

నేను ఎన్నో దేశాలు తిరిగాను, అభివృద్ధి చూశాను, ఏ విధంగా చేయాలో ఆలోచన ఉంది. ఇక్కడ పరిస్థితులను బట్టి ప్రతి మండలంలో నెలకోసారి నియోజకవర్గంలో ఆరు నెలలకు ఒకసారి అభివృద్ధి పనులపై, ప్రజల సమస్యలపై అధికారుల సహకారంతో సమీక్ష జరిపి, ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చేస్తా.

• స్పందన ఎలా ఉంది?

అన్ని గ్రామాల్లో ప్రచారం చేశా, సామాజిక వర్గాలు అన్ని స్వాగతిస్తున్నాయి. గత ప్రభుత్వంలో అవినీతిపై మాట్లాడుతున్నప్పుడు ప్రజల్లో స్పందన గమనించా. ఓ గ్రామంలో ఓ వ్యక్తి ఫ్యాన్ గిరగిరా తిరుగుతున్న సింబల్‌ను చూపించాడు. తాను ప్రచారం ముగించుకుని వస్తున్నప్పుడు అతనే తన వద్దకు వచ్చి కరచాలనం చేశాడు. ఇదే మార్పు. జనం మార్పు కోరుకుంటున్నారు.

• గెలుపు పై మీరేమనుకుంటున్నారు.

సునాయాసంగా గెలుస్తాను. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంది. సంక్షేమం ఒక్కటే కాదు, అభివృద్ధి కూడా అవసరమని గుర్తించారు. ఈ రోజున యువతకు ఉపాధి కల్పించటానికి చంద్రబాబు వస్తేనే సాధ్యమని నమ్ముతున్నారు. ఎన్ఆర్ఐలు సహకారం అందిస్తున్నారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టామహేష్ కూడా యువకుడు కావడంతో ఆయన సులువుగా గెలుస్తారు. నియోజకవర్గంలో అభివృద్ధికి చేయూతను ఇస్తాం.

ఓటేసిన వారికి హెల్త్ ప్యాకేజీల్లో రాయితీ

ఏలూరు ఎడ్యుకేషన్, మే 10 : ఓటు వేసినట్టు వేలిపై 'సిరా' గుర్తు చూపిస్తే అన్ని హెల్త్ ప్యాకేజీలపై 20 శాతం రాయితి ఇస్తామని ఏలూరు ఆయుష్ ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాయితీ ఈ నెలాఖరు వరకు(ఆదివారం మినహా) వర్తిస్తుందన్నారు. వివరాలకు ఫోన్ నెంబరు 84669 97333లో సంప్రదించాలని కోరారు.

టీడీపీ గెలుపుతోనే సంక్షేమ ప్రభుత్వం

ద్వారకా తిరుమల, మే 10: ఉపాధి హామీ పథకం కూలీల వద్దకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిపెద్ది వెంకటేశ్వరరావు వెళ్లి వారికి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీ గెలుపుతోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన వస్తుందని జగన్ ప్రభుత్వాన్ని ఓటు హక్కుతో ప్రజలు తరమికొట్టాలని కోరారు. కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజును, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని ప్రచారం చేశారు. మాజీ ఎంపీపీ ఏపూరి దాలయ్య, మటపర్తి బద్రి, జనసేన నాయకులు చిలుకూరి ఫణి, పెనుమాల రాములు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలు ఇవే

ఉంగుటూరు, మే 10: నియోజకవర్గంలోని నిడమర్రు, గణపవరం, భీమడోలు మండల్లాలో సమస్యాత్మక గ్రామాలను ఆయా సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ప్రకటించారు. ఉంగుటూరు మండలం కాకర్లమూడి, కైకరం, నారాయణపురం, తల్లాపురం, ఉప్పాకపాడు గ్రామాలను సమస్యాత్మకంగా ప్రకటించారు. నిడమర్రు సర్కిల్ పరిధిలోని చిన నిండ్రకొలను, పెదనిండ్రకొలను, నిడమర్రు, భువనపల్లి, క్రొవ్విడి, గణపవరం సర్కిల్ పరిధిలోని గణపవరం, పిప్పర, అగ్రహారం గోపవరం, కొమ్మర, జల్లి కాకినాడ, భీమడోలు సర్కిల్ పరిధిలోని పాత అంబర్ పేట, తదితర గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా పోలీసులు గుర్తించారు.

రాజకీయ అరాచకంపై చర్చకు రండి

ఏలూరు ఎడ్యుకేషన్, మే 10 : ఏలూరులో జరిగిన 'దళితగళం' సమావేశం వివరాలను సమతా సైనిక్ దళ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఈపిజర్ల మణిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దళితుల 27 సంక్షేమ పథకాలను రద్దు చేయడం, డాక్టర్ అంబేద్కర్ పేరున ఉన్న విదేశీ విద్యా పథకానికి పేరుమార్చడం తగదన్నారు. దళితుల హత్యలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల మళ్లింపు తదితర వాటికి సీఎం జగన్ సమాధానం చెప్పాలన్నారు. అలాగే 15 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్నా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఎమ్మెల్యే నివాస గృహానికి ఎదురుగా ఉన్న రోడ్డు ఆక్రమించుకుని ప్రజాదర్బార్ నిర్వహిస్తుండటం తగదన్నారు. ఇటువంటి మరెన్నో అంశాలపై తమతో చర్చకు రావాలని మణిరాజు డిమాండ్ చేశారు. సమావేశంలో దళిత నాయకులు కలపాల రవి, గుడుపూడి రవి, పిల్లి సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

పోలవరం, మే 10 : స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అధికారులు మండలంలో జరిపిన దాడుల్లో 60 మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఎస్ఐ కోలా వీరబాబు శుక్రవారం తెలిపారు. గూటాలలో వేగిరౌతు సురేష్ నుంచి 24, దుమారపు సాయి సతీష్ నుంచి 36 మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామాల్లో ఎన్నికల సందడి



కొయ్యలగూడెం/జీలుగుమిల్లి/పోలవరం మే 10: గ్రామాల్లో ఎన్నికల సందడి ఊపందుకుంది. కూటమి అభివృద్ధిలో చిర్రి బాలరాజు, ఎంపీ అభ్యర్థి మహేష్‌ను గెలిపించాలంటూ ప్రచారాలు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా మండలంలోని గవరవరంలో మహిళలు ఇంటింటికీ వెళ్ళి బొట్టుపెట్టి గ్లాస్ గుర్తుకు, సైకిల్ గుర్తుకు ఓటు వేయాలంటూ వేడుకుటున్నారు. గ్రామాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. అనేక గ్రామాల్లో భోజనాలు పెట్టి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. గిరిజన గ్రామాల్లో ప్రచారం జోరందుకుంది. జీలుగుమిల్లి మండలంలో అంకన్నగూడెం, దిబ్బగూడెం, రామచంద్రాపురం, పూచికపాడు, జగన్నాథపురం మారు మూల గిరిజన గ్రామాల్లో కూటమి అభ్యర్థులు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజును గెలిపించాలని ప్రచారం సాగించారు. సరిపల్లి సత్యనారాయణరాజు, సోయం ప్రకాష్, వీరంకి పాపారావు, బేతి వెంకట్ ఉన్నారు. గూటాల గ్రామంలో శుక్రవారం జనసేన నాయకుడు కరాటం రాంబాబు ప్రచారం నిర్వహించారు. ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న పుట్టా మహేష్ యాదవ్‌కి సైకిల్ గుర్తుపై అసెంబ్లీకి పోటీ చేస్తున్న చిర్రి బాలరాజుకి గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి కూటమి నాయకత్వాన్ని గెలిపించాలని కోరారు. టీడీపీ మాజీ మండల అధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య, యువజన నాయకులు పెద్దేహపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో నా స్వరం వినిపిస్తా

- ప్రజా మద్దతుతో నేనేనంటున్న మహేష్
- వైసీపీకి దీటుగా మద్దతు కూడగట్టుకున్నట్టు అంచనా
- పోలవరం, చింతలపూడి ప్రస్తావన మరొక ప్లస్
- రైతులు, మహిళలు, యువతకు భరోసా
- పార్లమెంట్ నియోజకవర్గ బరిలో 13 మంది

ఏలూరు, ఆంధ్రజ్యోతి : ఏలూరు లోక్‌సభ ఎన్నికల సమరాంగణంలో నువ్వా నేనా అన్నట్టుగా ప్రచారం. ఒకవైపు సవాళ్ళు ప్రతి సవాళ్ళు. తమను గెలిపిస్తే నియోజకవర్గానికి ఏం చేయబోతున్నామో వాగ్దానాలు. మారుమూల గ్రామాలకు వెళ్ళి రైతు పడుతున్న కష్టాలను చూశారు. పట్టణాల్లో ఉపాధి లేక అల్లాడుతున్న నిరుద్యో యువతను ప్రత్యక్షంగా వీక్షించారు. నిలిచిపోయిన ప్రాజెక్టులు, పెండింగ్‌లో పడిని అభివృద్ధి పనులు, పెరిగిన నిత్యావసరాలను గమనించారు. ప్రజలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, మూలనపడ్డ పథకాలకు ప్రాణం పోస్తామంటూ ఇన్నాళ ప్రచారంలో హోరెత్తించారు. నేటి సాయంత్రంతో ప్రచారానికి తెరపడబోతోంది. ఏలూరు లోక్‌సభ బరిలో కూటమి బలపర్చిన తెలుగుదేశం అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ ఓ వైపు, వైసీపీ పక్షాన సునీల్‌కుమార్ ఇంకోవైపు. వీరితోపాటు మరో 11 మంది అభ్యర్థులు ప్రచారంలో ఢీకొంటున్నారు.

ప్రజలను మెప్పించిన మహేష్

పుట్టా మహేష్ ప్రచారంలోనూ, సమస్యల ప్రస్తావనలోనూ ఏడు నియోజకవర్గాల్లో ప్రజలను మెప్పించగలిగారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గాలైన చింతలపూడి, పోలవరాల్లో మారుమూల గ్రామాలకు ప్రచారానికి వెళ్ళి, పోలవరం ప్రాజెక్టు ఆగిన నిర్మాణం, చింతలపూడి ఎత్తిపోతల పనులు అడ్రస్ లేకపోవడం వంటి సమస్యలను ప్రస్తావించడమే కాకుండా తనను ఎంపీగా ఎన్నుకుంటే ఢిల్లీలోని పార్లమెంట్‌లో మీ స్వరమై వినిపిస్తా. పోలవరం పనులను దగ్గరుండి పూర్తి చేస్తా అంటూనే పనులు నిలిచిపోవడానికి కారణం మీరు కాదా అంటూ వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, నేడు పోటీలో ఉన్న అభ్యర్థులను నిలదీయడంతో రైతుల మద్ధతును కూడగట్టుకున్నట్టు కూటమి పక్షం ఒక అంచనాకు వచ్చింది. సాధారణంగా ఎమ్మెల్యే అభ్యర్థులే స్థానిక సమస్యలను ప్రస్తావిస్తారు. కానీ లోక్‌సభ అభ్యర్థిగా మహేష్‌యాదవ్ ఏ మాత్రం బేషజానికి పోకుండా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అక్కడ పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థుల పక్షాన స్థానిక సమస్యలను లేవనెత్తి పరిష్కారానికి చొరవ తీసుకుంటానంటూ భరోసా ఇచ్చి, గ్రామాల్లో కూడా ప్రజల మద్దతును కూడగట్టుకున్నట్లు విశ్లేషిస్తున్నారు. ఇంతకుముందు ఐదేళ్ళలో జరిగిన వైఫల్యాలను ఒక్కటీ ప్రస్తావించకుండా తనకుంటూ రాజకీయ అవగాహనతోపాటు స్థానిక సమస్యలపై ఫోకస్ చేయడం కూడా తెలుసునని మహేష్ నిరూపించుకుంటున్నట్టు పోటీలో ఉన్నవారే ప్రస్తావన తేవడం విశేషం.



చంద్రబాబు సభలో మాట్లాడుతున్న మహేశ్ యాదవ్

ఢిల్లీకి నేనే వెళ్తా..

ఏలూరు లోక్‌సభ నుంచి ప్రజా మద్దతు కూడగట్టుకోగలిగానని, ఈనెల 13న జరిగే పోలింగ్‌లో తనకు అనూహ్య మద్ధతు లభించడం ఖాయమనే ధీమాతో పుట్టా మహేష్‌తోపాటు మిగతా కూటమి సీనియర్లు ఉన్నారు. చట్టసభలకు పోటీచేయడం ఇదే ప్రధమమైనా లోక్‌సభ అభ్యర్థిగా తనకు మద్ధతు పలకడమే కాకుండా పార్లమెంట్‌లో నా స్వరం వినిపించేలా ప్రజలే సిద్ధమై పోయారనే విశ్వాసంతో మహేష్ ఉన్నారు.





గణపవరంలో రోడ్డుషో నిర్వహిస్తున్న ధర్మరాజు...హారతులు ఇస్తున్న మహిళలు

అభివృద్ధి చేసి చూపిస్తా

ఉంగుటూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ధర్మరాజు

గణపవరం, మే 10: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం గణపవరం మండలంలో వల్లూరు, ముగ్గళ్ళ, జల్లికొమ్మర, వెలగపల్లి, వరద రాజపురం, కొత్తపల్లి, సరిపల్లె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని రంగాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రానున్నది కూటమి ప్రభుత్వమేనని ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామని ప్రజలు గ్రహించి ఓటు వేయాలని కోరారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, అడ్డేపల్లి వాసురాజు, ముత్యాల వేణు, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, సరిపల్లి చిన్న, నాగేశ్వరరావు, నిరుద్యోగి పెద్దిరాజు, జూంపల్లి రాజేంద్ర, సిదెళ్ళ వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు తోట శ్రీనివాసరావు, కూసంపూడి జగపతిరాజు, గంటా అన్నవరం పాల్గొన్నారు.

వైసీపీ మునిగిపోతున్న నావ

ఏలూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి

ఏలూరు టూ టౌన్, మే 10: వైసీపీ మునిగిపోతున్న నావ అని అధికారంలోకి వైసీపీ ప్రభుత్వం రాదని తెలిసి అందరూ టీడీపీ వైపు పరుగులు తీస్తున్నారని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో వైసీపీ కార్యకర్త జల్లా హరికృష్ణ ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు శుక్రవారం టీడీపీ లో చేరారు. చంటి వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని చేష్టలతో కార్యకర్తలంతా విసుగు చెందారన్నారు. ఇప్పటికే ఉద్యోగులంతా మూకుమ్మడిగా కూటమికి పోస్టల్ బ్యాలెట్ రూపంలో ఓట్లు వేశారని అన్నారు. ప్రజలు కూడా టీడీపీ కూటమికి పట్టం కట్టేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. ఏలూరు నియోజజకవర్గ ప్రజలకు మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటికి నాని ఏమి చేయ్యలేదనే తీవ్ర అసంతృప్తితో ప్రజలు ఉన్నారని రాధాకృష్ణయ్య అన్నారు. బడేటి కుటుంబం మొట్టమొదటి నుంచి ప్రజల్లో మమేకం అయిన కుటుంబమని ప్రజలకు తెలుసునని అన్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి ఉదయం 5 గంటల నుంచి ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేవాగుని గుర్తు చేశారు. తాను కూడా ఐదేళ్లగా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తున్నానని అన్నారు. ఏలూరు నియోజకవర్గం నుంచి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే రానున్న ఎమ్మెల్యేగా సేవలందిస్తానని అన్నారు.



టీడీపీలో చేరుతున్న వైసీపీ నేతలు

ఐదేళ్ళ వైసీపీ పాలన అవినీతిమయం : చింతమనేని

పెదవేగి, మే 10 : ఐదేళ్ళ వైసీపీ పాలన అవినీతిమయమని, దాడులు, దౌర్జన్యాలతో రాష్ట్రం అతలాకుతలమైందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. జగన్ పాలన ఇంకా ఉంటే ప్రజలు దుర్భర జీవితాన్ని గడిపే దుస్థితి తలెత్తుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే కూటమి గెలుపు అవసరమన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ కూటమిని అధికారం లోకి తీసుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓటమి భయంతో వైసీపీ నాయకులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి సంస్కృతికి చరమగీతం పాడే సమయం వచ్చిందన్నారు. విష సంస్కృతిని పెంచి పోషిస్తున్న వైసీపీ ప్రభుత్వంపై ప్రజలకు విరక్తి కలిగిందని, సంక్షేమ పాలన అందించే చంద్రబాబుకు పట్టం గట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నార ప్రభాకర్ పేర్కొన్నారు. పార్టీ నాయకులు చింతమనేని సతీష్‌కుమార్, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, లావేటి శ్రీనివాసరావు, మాగంటి నారాయణ ప్రసాద్, కాళింగి మనోహర్ పాల్గొన్నారు.



దుగ్గిరాలలో ప్రచారం చేస్తున్న ప్రభాకర్



శ్రీవారి సేవలో ట్రాన్స్‌కో జేఎండీ

ద్వారకాతిరుమల, మే 10:చిన్నతిరుమలేశుని ఆలయాన్ని విజిలెన్స్, ట్రా న్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లారెడ్డి శుక్ర వారం కుటుంబ సమేతం గా సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శనం అనం తరం అర్చకులు వారికి వేదాశీ ర్వచనం, ప్రసాదాలను అందించగా ఆలయ ఏఈవో దుర్గా రావు శ్రీవారి చిత్రపటం అందించారు.

సామూహిక శ్రీలక్ష్మీ కుబేర వ్రతాలు

ఏలూరు కార్పొరేషన్/కామవరపుకోట/బుట్టాయగూడెం మే 10: అక్షయ తృతీయ సందర్భంగా శుక్రవారం సత్రంపాడు శ్రీఅంబికాదేవి అమ్మవారి సన్నిధిలో భకులు సామూహికంగా శ్రీలక్ష్మీ కుబేర వ్రతాలు, రాహుకాల కుంకుమ పూజలు నిర్వహించారు. కామవరపుకోట శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితా శ్రీ పీఠంలో శుక్రవారం భక్తులతో పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్యశ్రీనివాసాచార్యులు సామూహిక కుంకుమ పూజలు, కుబేర వ్రతాలు జరిపించారు. జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం శ్రీ సీతారామ స్వామివారి ఆల యంలో శ్రీసంహాద్రి అప్పన్న స్వామికి అక్షయ తృతీయ రోజు శుక్రవారం చందనోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి అలయం వద్ద నిర్వహిస్తున్న వైశాఖ బ్రహ్మోత్సవాలలో శుక్రవారం అమ్మవార్లకు, శ్రీవారికి విశేష తిరుమంజనసేవ నిర్వహించారు.

రోషన్‌కు మద్దతుగా ఎన్ఆర్ఐల బైక్ ర్యాలీ

చింతలపూడి/కామవరపుకోట/లింగపాలెం, మే 10: చింతలపూడి కూటమి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ రోషన్‌కుమార్‌కు మద్దతుగా నియోజకవర్గానికి చెందిన ఎన్ఆర్ఐలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మోటారు సైకిళ్లు, కార్లతో ర్యాలీ నిర్వహించారు. చింతలపూడి పార్టీ కార్యాలయంలో రోషన్ బర్త్‌డే కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి ప్రగడవరం, గోకవరం, రంగాపురం మీదుగా కామవరపుకోట, జంగారెడ్డిగూడెం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ బొల్లినేని సాయి మాట్లాడుతూ హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, పూణె, కాన్పూర్, విదేశాల్లో ఉన్న ఉద్యోగులు కూటమి అభ్యర్థికి ఓటు వేయటానికి వస్తున్నారన్నారు. చింతలపూడి సుప్రియంపేటలో అభిమానుల మధ్య కేక్ చేశారు. అనంతరం టీకేఎం ఫంక్షన్ హాలులో పట్టణ ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. కామవరపుకోట మండలం ఆడమిల్లిలో కూటమి శ్రేణులు, రోషన్‌కుమార్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేయించారు. మండల టీడీపీ అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, సర్పంచ్ గూడపాటి కేశవరావు, యలమర్తి రాంబాబు, తూతా లక్ష్మణరావు, మద్దిపాటి శ్రీను, నల్లమెల్లి భుజంగరావు, తూంపాటి అబ్రహం, పాల్గొన్నారు. లింగపాలెం మండలంలోని నరసన్నపాలెం, తిమ్మ కృపాలెం గ్రామాల్లో కూటమి అభ్యర్థి రోషన్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లిఖార్జున్‌రావు, ముసునూరి రాము, కూరపాటి వెంకటేశ్వరరావు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న సొంగా రోషన్‌కుమార్

ఘనంగా పుట్టిన రోజు వేడుకలు

రోషన్ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రగడవరంలో టి.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో, లింగపాలెంలో టీడీపీ నాయకులు మోరంపూడి మల్లికార్జున్‌రావు, పల్లె శ్రీను ఆధ్వర్యం లో జంగారెడ్డిగూడెంలో పుట్టినరోజు వేడుకలు జరిగాయి. అడుమిల్లిలో తానేటి సుబ్బయ్య అనే పేదవాని ఇంట్లో సహపంక్తి భోజనం చేశారు. జె.ముత్తారెడ్డి, కె.రాజారెడ్డి, జనసేన నాయకులు టి.నాగవిజయ్ కుమార్, ఎన్ఆర్ఐ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రక్తదానం

బుట్టాయగూడెం, మే 10: చింతలపూడి నియోజకవర్గ కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్ జన్మదినం సందర్భంగా శుక్రవారం క్యాంపు కార్యాలయంలో జంగారెడ్డిగూడెం పట్టణ టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించి 50 మంది యువకులు రక్తదానం చేశారు. శిబిరాన్ని పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామ్‌కుమార్ ప్రారంభించారు. నాయకులు పారేపల్లి పవన్, గాలి చైతన్య, గద్దె జస్వంత్ తదితరులు రక్తదానం చేశారు.

దోమల వ్యాప్తి నివారణకు చర్యలు

ఏలూరు రూరల్, మే 10: పరిసరాల పరిశుభ్రత ఆచరించటం ద్వారా దోమలవ్యాప్తిని అరికట్టుకోవచ్చని, దోమల ద్వారా వచ్చేవ్యాధులు డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధులను కొంతవరకు తగ్గించుకోవచ్చని అసిస్టెంట్ మలేరియా అధికారి కె.గోవిందరావు పేర్కొన్నారు. ఫ్రైడేడ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వెంకటాపురం, సాయినగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు తులసి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టులు తనిఖీ

జీలుగుమిల్లి/బుట్టాయగూడెం మే 10 : తాటియాకులగూడెం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును ఏలూరు పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు టి.జోర్డాన్ బూటియా బుధవారం పరిశీలించారు. కొద్దిసేపు విధులు నిర్వహించే సిబ్బంది వాహనాల తనిఖీ తీరును పరిశీలించారు. సహాయ వ్యయపరిశీలకులు పీఎస్పీఎస్ శివనాగరాజు ఉన్నారు. జంగారెడ్డిగూడెం చెక్‌పోస్టును, వివిధ వాహన తనిఖీలను ఏలూరు పార్లమెంటరీ వ్యయ పరిశీలకుడు టి.జోర్డాన్ బూటియా పరిశీలించారు. ఈయన వెంట సహాయ వ్యయ పరిశీలకుడు పీఎస్‌పీఎస్ శివ నాగరాజు, ఎస్ఎస్‌టీ టీమ్ ఆఫీసర్ పి.బ్యూలా అధికారులు సిబ్బంది ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ : జేసీ లావణ్యవేణి

దెందులూరు/ఉంగుటూరు మే 10 : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి అన్నారు. స్థానిక ఎన్నికల కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో మొత్తం 15 మంది పోటీలో ఉన్నారన్నారు. ఇంటికే పరిమితమైన 95 మంది ఇప్పటికే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని జేసీ తెలిపారు. 2,431 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారన్నారు. అభ్యర్థులు శనివారం సాయంత్రం 5 గంటలతో ప్రచారం ముగించాలన్నారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నియోజకవర్గంలో వాహనాల తనిఖీ ద్వారా రూ.21, 61,040ల నగదు, 16 కేజీల 216 గ్రాముల బంగారం, 31 కేజీల 42 గ్రాముల వెండి సీజ్ చేయడం జరిగిందని జేసీ లావణ్యవేణీ తెలిపారు. ఉంగుటూరులో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సెక్టార్ అధికారులకు, వీఆర్వోలకు ఎన్నికల సమాయత్తంపై రిటర్నింగ్ అధికారి ఖాజావలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సామాగ్రి తరలించేందుకు 50 బస్సులను సిద్ధం చేశామన్నారు. 25 సెక్టార్ ఆఫీసర్లను నియమించామని, 214 పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ, అలాగే పోలింగ్ మెటీరియల్ అందించేందుకు వంద మంది సిబ్బందిని నియమించామన్నారు. నియోజకవర్గంలో 29 ప్రాంతాలలో 52 పోలింగ్ కేంద్రాల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామన్నారు. 150 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,06,437 మంది ఓటర్లు ఉన్నారన్నారు.

ఎన్నికల సిబ్బందికి సౌకర్యాల కల్పనకు వినతి

ఏలూరు ఎడ్యుకేషన్, మే 10 : ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి చేసిన ఏర్పాట్లపై శుక్రవారం ఏపీఎన్జీవోల జేఏసీ ఉమ్మడి జిల్లా నాయకుల బృందం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌తో చర్చించిన అంశాలను, ఉద్యోగులకు కల్పించాల్సిన సౌకర్యాల వివరాలను శక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలని, ఏజెన్సీ, దూరప్రాంతాల్లో విధులు నిర్వహించేవారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, పోలింగ్ ముగిసిన అనంతరం మెటీరియల్ రిసీవింగ్ సెంటర్ల వద్ద ఎక్కువ కౌంటర్లను ఏర్పాటు చేసి త్వరితగతిన ప్రక్రియ పూర్తిచేయాలని, ఎన్నికల విధుల అనంతరం పారితోషకాన్ని వెంటనే చెల్లించాలని, ఉద్యోగులందరికీ 14న సెలవు ఇవ్వాలని కోరామన్నారు. తమ అభ్యర్థనపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జేఏసీ ఉమ్మడి జిల్లా ఛైర్మన్ సీహెచ్.శ్రీనివాస్, కన్వీనర్ ఎన్.రామారావు, రాష్ట్ర జేఏసీ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్ఎస్ హరనాథ్, శ్రీధరరాజు, సత్యనారాయణ, పి.శ్రీనివాసరావు, హరినారాయణ తదితరులు ఉన్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం

బుట్టాయగూడెం, మే 10: గ్రామ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5 నుంచి 6 గంటల ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై నల్లటి మబ్బులు అలముకున్నాయి. మబ్బులతో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావడం కుండపోత వర్షం అర్ధ గంటపాటు కురవడం జరిగిపోయాయి. ఈ వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు.

క్రైం వార్తలు

ఆర్టీసీ బస్సు ఢీ కొని సెక్యూరిటీ గార్డు మృతి

ఏలూరు క్రైం, మే 10 : సైకిల్‌పై వెళ్తున్న ఒక సెక్యూరిటీ గార్డును వెనక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరులోని వెంకటాపురం పంచాయతీకి చెందిన పోలినాటి శేషు (63) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో శేషు డ్యూటీకి వెళ్తుండగా మార్గమధ్యలో ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో కర్రల వంతెన వద్ద కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వైపు వెళ్తున్న జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో ఎక్స్‌ప్రెస్ అతి వేగంగా వచ్చి శేషును ఢీ కొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ సీఐ ఎం ప్రభాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. బస్సును సీజ్ చేశారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

లారీపై నుంచి పడి బీహార్ యువకుడి మృతి

ఏలూరు క్రైం, మే 10 : చేపలలోడు లారీపై పడుకున్న బీహార్ యువకుడు ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. బీహార్‌లోని హిరారియా జిల్లా బచ్చాకాడి గ్రామానికి చెందిన అజాముద్దీన్ (22) మరికొంత మంది కలిసి చేపలు పాకింగ్ చేసే పనులకు కొద్ది రోజుల క్రితమే వచ్చారు. చేపల చెరువు వద్ద నుంచి లోడు వేసుకుని ఐస్ ప్యాకింగ్ కోసం గుండుగొలను సమీపంలో ఉన్న ఐస్ ఫ్యాక్టరీకి శుక్రవారం ఉదయం లారీ వెళ్తుండగా ఆ లారీలోడుపై అజాముద్దీన్ పడుకున్నాడు. లారీ ఒక్కసారిగా అటు ఇటు వేగంగా వెళ్తూ కుదుపురావడంతో పైన నిద్రిస్తున్న అజాముద్దీన్ కిందపడిపోయాడు. తీవ్ర గాయాలకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రి తీసుకురాగా చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సూపర్‌వైజర్ దాడి

ఏలూరు క్రైం, మే 10 : మోటారు సైకిల్ ట్రయల్ వేయని మెకానిక్‌పై సూపర్‌వైజర్ దాడి చేయడంతో రెండు పళ్ళు ఊడిపోగా, మరో రెండు పళ్ళు కదిలి పోయాయి. ఏలూరు సమీపంలోని సత్రంపాడులో ఉన్న నేరెళ్ళ రాజా ఆటోమొబైల్ షోరూమ్‌లో పోలవరపు మణికంఠ (17) మెకానిక్‌గా పనిచేస్తున్నా డు. ఆదే షోరూమ్‌లో రాకేష్ అనే యువకుడు సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఒక మోటారు సైకిల్‌ను ట్రయల్ వేసిరావాలని మణికంఠకు చెప్పడంతో తాను వెళ్ళలేనని సీనియర్ మెకానిక్‌లకు చెప్పడంతో ఆగ్రహించిన రాజేష్ వెంటనే తన చేతిలో ఉన్న ఇనుప వస్తువుతో మణికంఠ ముఖంపై కొట్టాడు. దీంతో అతని రెండు పళ్ళు ఊడిపోగా, మరో రెండు పళ్ళు కదిలిపోయాయి. దీంతో అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

లాడ్జీలలో తనిఖీలు

ఏలూరు క్రైం, మే 10 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు లాడ్జీలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలోని అనుమానాస్పద వ్యక్తులను పరిశీలించారు. లాడ్జీల్లో బస చేసిన వారి గుర్తింపుకార్డులను పరిశీలించి వారు ఎందు నిమిత్తం లాడ్జీలో బస చేశారో అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో నేరాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళ సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.


ఓటర్ స్లిప్పుల పంపిణీలో పాల్గొన్న వలంటీర్లు

ఓటరు స్లిప్పుల పంపిణీలో వలంటీర్లు!

నూజివీడు, మే 10: సార్వత్రిక ఎన్నికల్లో వలంటీర్లతో ఏ పనీ చేయించ కూడదని, ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలిచ్చినా అవి క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. వలంటీర్లతో రాజీనామా చేయించి వారితో ఎన్నికల విధులను నిర్వర్తించేందుకు అధికార పార్టీ నాయకులు సంసిద్ధులయ్యారు. నూజివీడు పట్టణంలో ఓటర్ల కుటుంబ చరిత్ర తెలిసి, వారి కుటుంబ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పథకాలు కోల్పోవాల్సి వస్తుందంటూ మాజీ వలంటీర్లతో ఓటర్లకు వివరిస్తూ ఓట్ల స్లిప్పులు పంపిణీ చేస్తూ ఓట్లు పొందేందుకు రాజకీయ ఎత్తుగడ వేశారు. ఈ క్రమంలో నూజివీడు 1వ వార్డులోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో వార్డు కౌన్సిలర్ భర్త అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఓటర్ల స్లిప్పులు పంచుతూ ప్రలోభాలకు దిగుతున్నారంటూ వార్డు వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా దీనిపై నూజివీడు ఆర్వోకు ఫిర్యాదు చేసేందుకు స్థానికులు సంసిద్ధులు అవ్వడంతో అధికార పార్టీ ఆధ్వర్యంలో ఓటర్‌స్లిప్పుల పంపిణీకి ఏర్పాటుచేసిన శిబిరాన్ని అధికార పార్టీ నాయకులు తొలగించటం విశేషం.

కామినేనికి ఘన సత్కారం


కామినేని పాదాలను పాలతో కడుగుతున్న దృశ్యం

ముదినేపల్లి, మే 10: ఎన్నికల ప్రచారానికి వచ్చిన కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు శుక్రవారం ముదినేపల్లిలో ఘన సత్కారం లభించింది. ముదినేపల్లిలోని టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, ఆయన సోదరి డాక్టర్ ఈడ్పుగంటి రాజ్యలక్ష్మి, కుటుంబ సభ్యులు కామినేని పాదాలకు పాలభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం టీడీపీ కార్యకర్తలు ఈడ్పుగంటి నివాసం వద్ద కామినేని ఫ్లెక్సీకి పాలభిషేకం చేశారు.

మోడల్ పోలింగ్ స్టేషన్ ప్రారంభం



నూజివీడు, మే 10: ఓటింగ్ శాతాన్ని పెంచే లక్ష్యంతో ఓటర్లకు ప్రస్తుత ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించేందుకు నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో మోడల్ పోలింగ్ స్టేషన్‌ను నూజివీడు ఆర్వో వై.భవాని శంకరి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎం ద్వారా పోలింగ్ ఏ విధంగా నిర్వహిస్తాం, అందుకు సంబంధించిన ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పిస్తూ ఈ మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతుల దహనం



ముదినేపల్లి, మే 10: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతులను శుక్రవారం సాయంత్రం ముదినేపల్లిలో కూటమి నాయకులు దహనం చేశారు. తెలుగుదేశం పార్టీ కైకలూరు నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఆధ్వర్యంలో స్థానిక గురజ రోడ్డు సెంటర్లో నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతులను దహనం చేశారు. టీడీపీ జిల్లా కార్యదర్శి పోసిన పాండురంగారావు, ముదినేపల్లి ఉప సర్పంచ్ సుధాకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు వేంపాటి విష్ణురావు, జిల్లా ఓబీసీ సెల్ కార్యదర్శి బొల్లా శ్యామలరాజు గౌడ్ తదితరులు మాట్లాడుతూ ఈ యాక్ట్‌వల్ల రైతులు నష్టపోతారని కూటమి అధికారంలోకి రాగానే ఈ చట్టం రద్దుచేస్తుందని తెలిపారు.

తెలుసుకుందాం..

గుర్తులు ఎలా వచ్చాయంటే..



ఎన్నికల్లో అభ్యర్థులకు గుర్తులు ఎందుకిస్తారో తెలుసా..? 1952లో తొలి ఎన్నికల నాటికి అక్షరాస్యత 16 శాతం మాత్రమే. ఓటర్లు బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లు గుర్తించడం కష్టమైంది. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఓటర్లు సులభంగా గుర్తించేందుకు వీలుగా బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లతోపాటు ఎన్నికల గుర్తులను ముద్రించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ప్రముఖ చిత్రకారుడు ఎంఎస్ సేఠీతో పెన్సిల్ చిత్రాలను గీయించి బ్యాలెట్ పేపర్‌లో ఉపయోగించారు. అలా గుర్తులు రూపొందాయి. ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలకు వారు ఎంచుకున్న గుర్తులను కేటాయించింది. కొన్ని పార్టీలకు శాశ్వత గుర్తులు వచ్చాయి. రిజిస్టర్డ్ పార్టీలకు, స్వతంత్ర అభ్యర్థులకు ఫ్రీ సింబల్స్ కేటాయిస్తున్నారు.

\- ముదినేపల్లి

ఏజెంట్లే కీలకం..

పోలింగ్ రోజు అభ్యర్థుల తరఫున పరిశీలనకు కూర్చునే ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకం. అభ్యర్థులు నెలల తరబడి నిర్వహించిన ప్రచారం, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడిన కష్టానికి ఫలితం ఇచ్చేది పోలింగ్ కేంద్రమే. పోలింగ్ సక్రమంగా జరుగుతుందా లేదా అన్నది గమనించడం, బోగస్ ఓట్లు పడకుండా ఓటు వేయడానికి వచ్చిన వారిని అభ్యర్థుల తరఫున ఏజెంట్లు నిశితంగా పరిశీలించడం, ఏజెంట్ల పని. గుర్తింపు పొందిన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల తరఫున ప్రాధాన్యతా క్రమంలో ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలో కూర్చుంటారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి కదలిక ఏజెంట్లు నిశితంగా పరిశీలిస్తారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా ఏజెంటు అభ్యంతరాన్ని ప్రిసైడింగ్ అధికారికి తెలపవచ్చు. ఏజెంట్లుగా అభ్యర్థులు తమకు నమ్మకమైన వారిని కూర్చోబెడతారు. ఏజెంటు తప్పు చేసినా ఆ అభ్యర్థికి నష్టం కలుగుతుంది.

\- అత్తిలి


ఏరియేటర్లు తిప్పుతున్న దృశ్యం(ఇన్‌సెట్) రంగు మారిన రొయ్యలు

అయ్యో.. రొయ్య!

- అకాల వర్షంతో ఆక్సిజన్ లోపించి మృత్యువాత
- నష్టాల బారిన ఆక్వారైతు



కలిదిండి, మే 10 : అకాల వర్షాలతో చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ లోపించి వనామి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. వేసవిలో వనామి రొయ్యల సాగు లాభసాటిగా ఉండటంతో సుమారు 10 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కొండూరు, చినతాడినాడ, సున్నంపూడి, దుంపలకోడు దిబ్బ, కొండంగి గ్రామాల్లో చెరువుల్లో ఆక్సిజన్ కొరతతో రొయ్యలు చనిపోతుండటంతో కౌంటుకు రాకుండానే చిన్న సైజు రొయ్యలను హడావిడిగా పట్టుబడి చేస్తున్నారు. చిన్న సైజు రొయ్యలను వ్యాపారులు కొనుగోలు చేయకపోవటంతో ఆకివీడు, ఏలూరు, భీమవరం మార్కెట్‌లకు తీసుకెళ్లి అయిన కాడికి అమ్ముకుంటున్నామని, గిట్టుబాటు ధర లేక పెట్టుబడులు సైతం రాక నష్టాల పాలవుతున్నామని వాపోతున్నారు. చెరువుల్లో నిరంతరాయంగా ఏరియేటర్లు తిరుగుతున్నప్పటికీ రొయ్యలు చనిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. చనిపోయిన రొయ్యలు రంగు మారటంతో మార్కెట్‌లో కొనుగోలు చేయటం లేదని వాపోతున్నారు. అకస్మాత్తుగా రొయ్యలు మృత్యువాత పడటంతో వ్యాపారులు, దళారులు సిండికేటుగా మారి తక్కువ ధరకే రొయ్యలు కొంటున్నారని వాపో తున్నారు. విదేశీ మారక ద్రవ్యం లభించే రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆక్వా రైతులు కోరుతున్నారు.

ఆక్సిజన్ కొరత రానివ్వద్దు

ఆక్సిజన్ కొరత నివారణకు చెరువుల్లో హైడ్రోజన్ పెరాక్సైడ్ తగు మోతాదులో పిచికారీ చేయాలని మత్స్యశాఖాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. ఏరియేటర్లు నిరంతరాయంగా తిరుగుతూ ఉండాలని, బోట్లు, ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి చెరువుల్లో నీటిని రీసైక్లింగ్ చేయటంతో కెరటాలు రావటంతో ఆక్సిజన్ ఉత్పన్నమవుతుందన్నారు. గాలి వానకు విద్యుత్ సరఫరా నిలిచిపోతే ప్రత్యామ్నాయంగా అద్దె జనరేటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు చెరువుల్లో మేత తక్కువ వేయాలన్నారు.


ముదినేపల్లిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కామినేని


కైకలూరులో ఆర్యవైశ్య సంఘ నాయకుల ప్రచారం

అభివృద్ధి నిరోధక పాలనకు స్వస్తి : కామినేని

ముదినేపల్లి, మే 10 : అయిదేళ్లుగా రాష్ట్రంలో సాగుతున్న అభివృద్ధి నిరోధక పాలనకు ఓటర్లు ఈ నెల 13న స్వస్తి పలకనున్నారని కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లిలో శుక్రవారం సాయంత్రం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రచారం నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ వైసీపీ అసంబద్ధ, కుట్రపూరిత పాలన జరిపిందని విమర్శించారు. ఓటర్లు విజ్ఞతతో అభివృద్ధిని కోరుకునే పాలకులను ఎన్నుకోవాలని కోరారు. ముదినేపల్లిలో కామినేనికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. స్థానిక అంబేడ్కర్ నగర్, అంబేడ్కర్ కాలనీ, అన్నవరంలో ప్రచారం చేసి ఎస్సీల అభ్యున్నతికి కూటమి అధిక ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి, టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కొడాలి వినోద్, నాయకులు కొత్తూరు విఠల్, కోడూరు శేషుబాబు, చలసాని జగన్మోహనరావు, డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరులో కూటమి నాయకుల ప్రచారం

కైకలూరు, మే 10: కైకలూరులో కూటమి నేతలు విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు సతీమణి స్వర్ణకుమారి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ డమ్మీ ఈవీఎం ప్యాడ్లతో ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పీజేఎస్ మాల్యాద్రి ఆధ్వర్యంలో కైకలూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు కైకలూరులో దుకాణాల వద్ద ప్రచారాన్ని నిర్వహించారు. కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వైసీపీ అన్నివర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని, ఒక్కసారి బటన్ నొక్కి ఒక్కొక్క కుటుంబం నుంచి లక్షల్లో జగన్మోహన్‌రెడ్డి దోచుకున్నారని ఈ జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. మాజీ జడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మి, కూటమి నాయకులు బంకపల్లి సీతమ్మ, కైకలూరు సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, కైకలూరు-2 ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, కేకే బాబు, తోట లక్ష్మి, కౌంతి రాజేశ్వరి, మంచిగంటి వాసు, చెక్కా పూర్ణ, ఆచంట వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: కూటమి అధికారంలోకి వస్తేనే సూపర్ సిక్స్ పథకాలతో పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందని కైకలూరు మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు గంగుల శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండవల్లి మండలం అప్పాపురంలో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కామినేనికి కమలం గుర్తుపై, పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

కలిదిండి: కోరుకొల్లు, కలిదిండి, లంక గ్రామాల్లో శుక్రవారం కూటమి నాయకులు బృందాలుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు.


సమావేశంలో పాల్గొన్న ముస్లిం పెద్దలు

'వైసీపీని ముస్లింలు మరోసారి నమ్మవద్దు'

ఆగిరిపల్లి, మే 10: ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ ఇచ్చింది తామేనని చెప్పుకుంటున్న వైసీపీ మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని ఆగిరిపల్లి జామియా మసీదు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులకు ఓటువేస్తే ముస్లింలకు రిజర్వేషన్లు రద్దు చేస్తారన్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. టీడీపీ హయాంలోనే మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటుచేసి రుణాలు మంజూరు చేశారని, పలు పథకాలు అమలుచేశారన్నారు. కడపలో హజ్ హౌస్ నిర్మించారని, రంజాన్ పండుగకు తోఫాలు ఇచ్చారని, దుల్హన్ పథకానికి రూ.50 వేలు, యువతీ యువకులకు విదేశీ విద్య ముస్లీమ్‌లకు అన్యాయం జరగకుండా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేశారన్నారు. ఒక్కసారి అవకాశం ఇస్తే ఇస్లాం బ్యాంక్ ఏర్పాటు చేస్తామని, దుల్హన్ పథకానికి లక్ష ఇస్తామని చెప్పి మాటతప్పిన వైసీపీ ప్రభుత్వాన్ని నమ్మవద్దని అన్నారు. ఇస్లాంలో ఆత్మహత్య మహాపాపం అయినప్పటికీ అబ్దుల్ సలామ్ కుటుంబానికి దొంగతనం అంటగట్టి కుటుంబాన్ని ఆత్మహత్య చేసుకునేలా చేశారని, రాయలసీమ ముస్లిం భూములను ఆక్రమించి భూముల యజమానులను హింసించి చంపారని, ఇలా ఎన్నో ముస్లిం వ్యతిరేఖ చర్యలు చేపట్టిన వైసీపీని నమ్మి ఓటు వేయవద్దని తెలిపారు. కమిటీ అధ్యక్షుడు ఎస్.కె చాన్ బాషా, కాలీష, నాగుల్‌మీరా, కరీముల్లా, భాష పలువురు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు

వైసీపీ పాలనలో కాపులకు అన్యాయం: కమ్మిలి

కైకలూరు, మే 10: వైసీపీ కాపులకు తీరని అన్యాయం చేసిందని, తామంతా కూటమి గెలుపునకు కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. శుక్రవారం కైకలూరు ఎన్డీయే కార్యాలయంలో కాపు సంఘ నేతలతో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ 2019లో కాపులంతా దూలం నాగేశ్వరరావుని గెలిపిస్తే, ఆయన అధికారంలోకి వచ్చాక ఆ సామాజికవర్గంలో అనేకమందిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. ఆయనకు అండగా నిలిచిన తనను అవమానించారన్నారు. కాళ్ళపాలెం జనసేన సర్పంచ్ పేటేటి కనక లింగేశ్వరరావు మాట్లాడుతూ తనను తన మేనల్లుడ్ని ఎమ్మెల్యే కుమారుడు బెదిరించి అక్రమ కేసులు బనాయించారన్నారు. కోరుకొల్లులో జనసేన తరఫున పనిచేస్తున్న వారిపై కేసులు పెట్టారన్నారు. ఈడేపల్లి సర్పంచ్ ఏఎన్‌బాబు మాట్లాడుతూ తనవద్ద వందెకరాల చెరువును ఎమ్మెల్యే కుమారుడు లీజుకు తీసుకుని బెదిరించాడన్నారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుకు మరోసారి ఓట్లు వేసి కాపులు మోసపోవద్దని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీలు వలవల రామారావు, చెన్నంశెట్టి మురళీకృష్ణ, కాపు సంఘం నేతలు కేవీఈఎస్‌ఎం నాయుడు, గుడివాడ చిట్టిబాబు, చిట్టూరి రవీంద్ర, పేటే టి కనకలింగేశ్వరరావు, నల్లజర్ల సత్యనారాయణ, మేడిశెట్టి సీతారామాంజనే యులు, కూనపురెడ్డి కోటేశ్వరరావు, చలమలశెట్టి శివపార్వతి పాల్గొన్నారు.

మద్యం, బియ్యం పట్టివేత


చాట్రాయి వద్ద స్వాధీనం చేసుకున్న మద్యంతో సెబ్ అధికారులు

చాట్రాయి, మే 10: మండల పరిధిలోని తెలంగాణ సరిహద్దులో గురువారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా రవాణా అవుతున్న 600 క్వార్టర్ మద్యం బాటిల్స్ పట్టుకొని, కారును స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ డీఎస్పీ జనార్దననాయుడు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ నుంచి మద్యం, సారా అక్రమ రవాణా జరగకుండా జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక చర్యలలో బాగంగా, నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య పర్యవేక్షణలో తెలంగాణ నుంచి వచ్చే రహదారుల్లో తనిఖీలు జరిపి మద్యం స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అదుపులో తీసుకున్నట్లు ఆయన వివరించారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, చాట్రాయి ఎస్సై కేసీహెచ్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార మద్యం స్వాధీనం.. ఐదుగురి అరెస్టు

నూజివీడు టౌన్, మే 10: నూజివీడు సెబ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 225 మద్యం బాటిళ్ళను, మూడు మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ పి.వెంకట రమణ తెలిపారు. ముసునూరు మండలం చెక్కపల్లిలో నిర్వహించిన దాడుల్లో నక్కా ఆంజనేయులను అదుపులోకి తీసుకుని అతని నుంచి 10 లీటర్ల సారా, నూజివీడు పెద్దగాంధీబొమ్మ సెంటర్లో ఆర్‌ఆర్ పేటకు చెందిన ఎ.రాజును అదుపులోకి తీసుకుని 37 బాటిళ్ల అనధికారిక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా శోభనాపురం గ్రామం వద్ద ఆగిరిపల్లి మండలం కొత్త ఈదరకు చెందిన దిడ్డి మోహన్‌రావును అదుపులోకి తీసుకుని 30 బాటిళ్ళ మద్యాన్ని, ఆగిరిపల్లి మండలం శోభనాపురానికి చెందిన నక్కబోయిన శివనాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని అతని నుంచి 48 బాటిళ్ల మద్యం, ద్విచక్ర వాహనాన్ని, నూజివీడు మండలం తిరువూరు రోడ్డులో నూజివీడు ఆర్‌ఆర్ పేటకు చెందిన సయ్యద్ బాజీని అదుపులోకి తీసుకుని అతని నుంచి 110 సీసాల అనధికారిక మద్యాన్ని స్వాధీన పరుచుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆలపాడులో 48 బీరు సీసాలు స్వాధీనం

కైకలూరు, మే 10: కైకలూరు మండలం ఆలపాడు శివారు ఉప్పుటేరు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేసి 48 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై జి. వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తుండగా పశ్చిమగోదావరి జిల్లా అయిభీమవరానికి చెందిన ఓ వ్యక్తి తన కారులో 48 బీరు సీసాలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



రేషన్ బియ్యం పట్టివేత

చాట్రాయి, మే 10: మండలంలోని బూరుగుగూడెంలో శుక్రవారం అక్రమంగా రవాణా అవుతున్న 3 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకొని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కేసీహెచ్ స్వామి తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు వివరించారు.



ఊడిపడిన స్లాబు పెచ్చులు.. గాయపడిన ఎంఈవో ప్రభాకర్ బాబు

ఎమ్మార్సీ భవనం స్లాబు పెచ్చులూడిపడి ఎంఈవోకు గాయాలు

కలిదిండి, మే 10: కలిదిండిలోని మండల విద్యావనరుల కేంద్రం (ఎమ్మార్సీ) స్లాబు పెచ్చులూడి పడి ఎంఈవో ప్రభాకర్ బాబు గాయాల పాలయ్యారు. స్లాబు పెచ్చులు తలపై పడటంతో తలకు రెండు చోట్ల గాయాల య్యాయి. ఆయనను స్థానిక ఆసుపత్రికి తరలించగా రెండు చోట్ల అయిన గాయాలకు పది కుట్లు పడ్డాయి. స్లాబు పెచ్చులూడిన సమయంలో సిబ్బంది లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. కార్యాలయంలో కంప్యూటర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. 2022 సంవత్సరంలో కూడా ఇదే విధంగా స్లాబు పెచ్చు లూడి సిబ్బందికి గాయాలయ్యాయి. కంప్యూటర్లు ధ్వంసమయ్యాయి. భవనానికి మరమ్మతులు చేపట్టాలని సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించా రు. ఇప్పటి వరకు మరమ్మతుల ఊసేలేదు. ఎంపీడీవో దినతేజ్, పంచాయతీ రాజ్ ఏఈఈ శ్రీనివాసరావు కార్యాలయాన్ని పరిశీలించారు. స్లాబ్ కూలిన ఘటనపై నివేదికను డీఈవోకు సమర్పిస్తామన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకారం

నూజివీడు టౌన్, మే 10: నూజివీడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణను చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.భూషణం తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, వచ్చే నెల 16వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరిస్తామని, 10వ తరగతి పాసైన విద్యార్థినీ విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన తెలిపారు.

ప్రత్యేక బస్సు సర్వీసులు

నూజివీడు టౌన్, మే 10: ఎన్నికల నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే వారికి ప్రత్యేకంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు నూజివీడు ఆర్టీసీ డీఎం పవన్‌కుమార్ తెలిపారు. వివిధ ఉద్యోగాలపై హైదరాబాద్‌లో నివసిస్తున్న వారు ఈ నెల 13వ తేదీ సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే క్రమంలో భాగంగా స్వగ్రామాలకు నూజివీడు వాసులు చేరుకుంటున్నారు. ఈ క్రమంలో బస్సుల రద్దీని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నుంచి నూజివీడుకు ప్రస్తుతం నడుస్తున్న సర్వీసులకు అదనంగా మరో మూడు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.


స్వగ్రామాలకు పయనమైన విద్యార్థులు

ట్రిపుల్ ఐటీకి సెలవులు

నూజివీడు, మే 10: రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు తమ స్వగ్రామాలకు బయల్దేరారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ కేంద్రంగా నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ విద్యార్థులు 5 వేల మంది, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్ విద్యార్థులు మరో వెయ్యిమంది రెసిడెన్షియల్ విధానంలో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్‌లో విద్యనభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు విద్యార్థులకు సాధారణ సెలవులను ప్రకటించడం, ఈనెల 13న సార్వత్రిక ఎన్నికలు ఉండటంతో విద్యార్థులు తమ స్వగ్రామాలకు పయనమయ్యారు. దీంతో విద్యార్థులతో కళకళలాడే ట్రిపుల్ ఐటీ క్యాంపస్ బోసిపోయింది. సుమారు 6 వేల మంది విద్యార్థులు స్వగ్రామాలకు పంపేందుకు ట్రిపుల్ ఐటీ అధికారులు రవాణా సదుపాయాలను కల్పించారు. మూడు రోజుల నుంచి రాజమండ్రి, విశాఖపట్నం, విజయనగరం, ఒంగోలు, కడప తదితర ప్రాంతాలకు నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ నుంచి ప్రత్యేకంగా సర్వీసులను ఏర్పాటు చేశారు. మొత్తం మూడు రోజులకు 60 బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు పేర్కొన్నారు.

నవతరం ఓటర్

మంచి నేతను ఎన్నుకుందాం

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, పేదరికం నిర్మూలనకు సరైన పరిపాలన చేయగల సమర్థవంతమైన నాయకత్వం కావాలని నూతనంగా ఓటు హక్కు పొందిన యువత కోరుతున్నారు. అలాంటి వారికే తమ ఓటు అని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు మంచి ప్రణాళికలు రూపొందించి అమలు చేయగల నాయకుడు అవసరమని కూడ పలువురు చెబుతున్నారు. కైకలూరు నియోజకవర్గ నూతన ఓటర్ల అభిప్రాయమిది. - ముదినేపల్లి

అభివృద్ధి చేసేవారికే ఓటు



తొలిసారి ఓటు వేయబోతున్నా. నియోజకవర్గం అభివృద్ధి కోసం ఆలోచించే అభ్యర్థులను ఎన్నుకోవాలి. సమర్థత, సేవా భావం ఉన్న వారిని గెలిపించుకుంటేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుంది. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించగలరన్న నమ్మకం కలిగిన అభ్యర్థులకి ఓటు వేద్దాం.

మీసాల నాగ భవానీ శంకర్, ముదినేపల్లి

ప్రలోభాలు వద్దు



ఎన్నికల్లో ధన ప్రభావం తగ్గాలి. ఓటర్లను ప్రలోభ పెట్టడం రాజకీయ నాయకులు మానుకోవాలి. యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రలోభాలకు ఓటర్లు గురి కాకూడదు. మంచి ఆశయాలు కలిగిన పార్టీలకు నాయకులకు యువత మద్దతునివ్వాలి.

మేలిమి భాను చంద్, శ్రీహరిపురం

సమర్థ నాయకుడికే ఓటు



ఎన్నికల్లో ఓటర్లు చైతన్యవంతంగా వ్యవహరించాలి. యువత తమ భవిష్యత్‌కు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించ గల సత్తా, సమర్థత కలిగిన అభ్యర్థులను ఎన్నుకోవాలి. నూతనంగా ఓటు పొందిన యువత నవ శకానికి నాంది పలకాలి. ఓటుతో మన భవిష్యత్ మనమే తీర్చిదిద్దుకోవచ్చు.

పరిశె చైతన్య, తేరగూడెం, పేరూరు శివారు

మంచి నాయకుడు కావాలి



ప్రజా సంక్షేమంతోపాటు అభివృద్ధి చేయగల సత్తా ఉన్న నాయకుడిని ఎన్నుకోవాలి. నేటి యువత భవిష్యత్ తరాలకు మేలు చేయడమే కాక ఆదర్శంగా నిలవాలి. ప్రస్తుత నాయకులు యువతకు మార్గదర్శకులుగా, స్ఫూర్తిగా నిలవాలి. ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలి.

మోషాణం ప్రేమ్ సింగ్, సింగరాయపాలెం